Follow: @ANNTELUGU

12-04-2025

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 131 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సన్న బియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేసిన మంత్రి పొంగులేటి

మణుగూరు, మహా : పినపాక నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు.బూర్గంపాడు, అశ్వాపురం,మణుగూరు మరియు పినపాక మండలాల్లో శుక్రవారం పర్యటించారు.మంత్రి పొంగులేటి నేరుగా మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 30 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అక్కడే విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి , ఆయన చేసిన సేవలను మంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం లో భూ భారతి 2025 చట్టం తో తెలంగాణ లోని సన్నకారు రైతులకు, భూ సాములకు న్యాయం చేకూరుతుందని, 16 నెలల్లో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేర్చుకుంటు వెళుతున్నామని అన్నారు

**టాప్ న్యూస్**

## త్రిష ఫైర్



- బురదజల్లడమే మీ పనా?
- మిమ్మల్ని చూస్తుంటే భయమేస్తోంది
- సోషల్ మీడియా నెగిటెవిటీపై ఆగ్రహం

02


## తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ పొత్తు



- ప్రకటించిన అమిత్ షా
- సీఎం అభ్యర్థిగా పళని స్వామి

02

## తెలంగాణ బీజేపీలో చిలక జ్యోతిష్యులు



- పార్టీ అధ్యక్షుడిని ఎంపిక చేయడమే చేతకాదు
- గురివింద ఆరోపణలు చేస్తున్నారు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫైర్

02





# ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం

తుదిప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

ట్రిపుల్ ఆర్ సమీపంలో డ్రైపోర్ట్ నిర్మాణం

మెట్రో, ఆర్ఆర్ఆర్, ఎన్‌హెచ్‌లపై సీఎం సమీక్ష

**హైదరాబాద్, మహా:** ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సీఎంతో పాటు సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు అధికారులు వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.), రాయదుర్గంకోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్‌చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్‌పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్బీ నగర్ హయత్ నగర్ (7.1 కి.మీ.) మొత్తం 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24269 కోట్ల అంచనాలతో డీపీఆర్ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది.

మిగతా 2లో

## మూసీ పునరుజ్జీవన పనులు వేగవంతం చేయండి

- మీర్ అలం ట్యాంక్ పై బ్రిడ్జి అద్భుతంగా నిర్మించాలి
- మూడు ప్రాంతాల్లో ఐలాండ్ లను తీర్చిదిద్దాలి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

02

## హెచ్ఆర్‌సీ చైర్ పర్సన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్

### లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖరరెడ్డి

ఉత్తర్వులు జారీ.. ఇద్దరిదీ నల్లగొండ నేపథ్యమే





**హైదరాబాద్, మహా:** చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, లోకాయుక్త, ఉపలోకాయుక్త పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్ఆర్సీ) చైర్మన్‌గా మరో రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను నియమించింది. ఇక ఉపలోకయుక్త గా జస్టిస్ బీఎస్ జగ్ జీవన్ కుమార్ ను నియమించింది. మానవ హక్కుల కమిషన్ సభ్యులుగా మాజీ ఐఏఎస్ డాక్టర్ బీ. కిశోర్, రిటైర్డ్ జిల్లా జడ్జి శ్రీమతి శివాది ప్రవీణలను నియమిస్తూ ఉత్తర్వులుజారీ చేసింది. జస్టిస్ రాజశేఖర్ రెడ్డి నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సిర్సనగండ్ల గ్రామంలో ఓ వ్యవసాయ కుటుంబంలో 1960, మే 4న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు జయప్రద, రామానుజరెడ్డి. హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీ నుంచి పట్టభద్రులైన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో బంగారు పతకం పొందారు. 1985, ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు.

మిగతా 2లో

## కేసీఆర్ కుటుంబంపై సీబీఐ విచారణ జరపాలి

### బీఆర్ఎస్ పాలనలో దోపిడీపై చర్చకు సిద్ధమా?



- కేటీఆర్ దమ్ముంటే చర్చకు రావాలి
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సవాల్
- సీఎంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం

వివరాలు 2లో

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

- జూన్ 15 నుండి జూన్ 30 మధ్య టెట్ ఎగ్జామ్స్
- ఈ నెల 15 నుండి 30 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూలై 22న ఫలితాలు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. తన బ్రాండ్ ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అని సీఎం ప్రకటించారు. టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందాలనుకునే అభ్యర్థులకు ఇది ఎంతో కీలకమైన పరీక్ష. ఈ పరీక్ష ద్వారా పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించవచ్చు.

మిగతా 2లో

## సన్నబియ్యం పథకం దేశంలోనే నెంబర్ వన్

కడుపు మంటతో బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలు

పేదల కడుపునిండినా ఓర్వలేకపోతున్నారు: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, మహా:** సన్నబియ్యం పథకం దేశంలోని సంక్షేమపథకాల్లో నెంబర్ వన్ అని, ఈ పథకం పేదల కడుపునింపుతుండడంతో బీజేపీ, బిఆరెస్ కడుపు మంట తో మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఏదో మాట్లాడాలని మాట్లాడ్తున్నారని, కడుపు నిండా భోజనం పెట్టే కార్యక్రమం తాను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సన్నబియ్యం పై అద్భుతమైన స్పందన ప్రజల నుండి వస్తుందని, ఎవరో ఒకరు విమర్శలు చేసి దాని గొప్పతనాన్ని దెబ్బతియ్యవద్దన్నారు.

మిగతా 2లో

## తమిళనాడు బీజేపీ కొత్త అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్



- పొత్తుల కోసం అన్నామలై త్యాగం
- తెలంగాణపై తేల్చుకోలేకపోతున్న హైకమాండ్

02

## హెచ్ సియు భూముల వెనుక రూ.10 వేల కోట్ల స్కామ్



- ఆ బీజేపీ ఎంపీ సహకరిస్తున్నాడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

02

## తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్?

- సౌమ్యుడిగా.. అందరివాడుగా ముద్ర
- అత్యధిక పదవీకాలం ఉండడం అడ్వాంటేజ్
- రేసులో ఐదుగురు.. సీవీ ఆనంద్, శివధర్ రెడ్డిల వైపే మొగ్గు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నియామకం కోసం జాబితాను సిద్ధం చేశారు. డీజీపీ పోస్టు కోసం ముగ్గురి పేర్లను ఎంపిక చేసి కేంద్రానికి పంపించాల్సి ఉండగా ఐదుగురి పేర్లను ఖరారు చేసి పంపినట్లు సమాచారం. ప్రస్తుత డీజీపీ జితేందర్ పదవీకాలం ఈ సంవత్సరం సెప్టెంబర్ నెలాఖరుతో ముగియనున్నది. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ తరువాత పోలీసు శాఖలో డీజీపీ పోస్టుకు ప్రాముఖ్యం, ప్రాధాన్యం ఉంది.



మిగతా 2లో



# ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవెలప్మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్ఖాన్పేట వరకు పొడిగించాలని చెప్పారు. అందుకు అవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. హెచ్ఎండీఏతో పాటు ఎఫ్ఎస్డీఏ ను (ఫ్యూచర్ సిటీ డెవెలప్మెంట్ అథారిటీ)ని ఈ రూట్ మెట్రో విస్తరణలో భాగస్వామ్యులను చేయాలని చెప్పారు.

**ఆర్ఆర్ఆర్ పనులు వేగవంతం చేయాలి**

రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్ఆర్ఆర్ సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని సీఎం అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం... ఆర్ఆర్ఆర్ పనుల పురోగతిపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్విజయవాడ గ్రీన్ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్గఢ్ రాజధాని రాయ్పూర్తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్హెచ్ఏఐ) పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీఎం ఆరాతీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్హెచ్ఏఐ అంగీకరించడం లేదని అధికారులు సీఎంకు వివరించారు. పంట కాలం దాదాపు పూర్తవుతున్నందున ఆ వెంటనే రైతులతో మాట్లాడి భూ సేకరణ పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భూ సేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు.. ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అన్నారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ముఖ్య ఇంజినీర్లు తిరుమల, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

### తమిళనాడు బీజేపీ కొత్త అధ్యక్షుడిగా

# నైనార్ నాగేంద్రన్

## పొత్తుల కోసం అన్నామలై త్యాగం

### తెలంగాణపై తేల్చుకోలేకపోతున్న హైకమాండ్



**చెన్నై:** తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి, తిరునెల్వేలి బీజేపీ ఎమ్మెల్యే నైనార్ నాగేంద్రన్ బాధ్యతలు చేపట్టనున్నారు. పార్టీ స్టేట్ ప్రెసిడెంట్ ఎలక్షన్కు శుక్రవారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. నాగేంద్రన్ ప్రస్తుతం తమిళనాడు బీజేపీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. టి.నగర్లోని బీజేపీ తమిళనాడు రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్ష స్థానం కోసం నామినేషన్ దాఖలు చేసిన తొలి అభ్యర్థి నాగేంద్రన్ కావడం గమనార్హం. అన్నామలై కూడా నైనార్ నాగేంద్రన్ పేరునే తమిళనాడు బీజేపీ అధ్యక్ష స్థానానికి ప్రతిపాదించారు. తమిళనాడు బీజేపీ నేతలు ఈ ప్రతిపాదనకు పచ్చ జెండా ఊపడంతో తమిళనాడు బీజేపీ కొత్త అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్ బాధ్యతలు స్వీకరించడం దాదాపు ఖాయమైంది. ఏప్రిల్ 12న ఢిల్లీలోని బీజేపీ హెడ్ క్వార్టర్స్లో నైనార్ నాగేంద్రన్ పేరును బీజేపీ హైకమాండ్ అధికారికంగా ప్రకటించనుంది. నైనార్ నాగేంద్రన్ గతంలో అన్నాడీఎంకేలో కొనసాగారు. తమిళనాడు బీజేపీ చీఫ్ పదవి నుంచి కె. అన్నామలై తప్పుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర బీజేపీ చీఫ్ పదవి రేసులో తాను లేనని ఆయన స్పష్టం చేయడంతో తమిళనాడు బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరనే చర్చ జరిగింది. నైనార్ నాగేంద్రన్ నామినేషన్తో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడి విషయంలో స్పష్టత వచ్చింది. 2026లో జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు కళ్లెం వేయాలని బీజేపీ డిసైడ్ అయింది. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామితో అమిత్ షా భేటీ అయ్యి చర్చలు జరిపారు. బీజేపీతో కలిసి పని చేసేందుకు అంగీకరించిన పళనిస్వామి తమిళనాడులో అన్నామలైని పదవి నుంచి తొలగించాలని కోరినట్లు సమాచారం.

**అమ్మో తెలంగాణ**

నిన్నగాక మొన్న తమ ఆదేశంతో ఖాళీ అయిన తమిళనాడుకు వెంటనే రాష్ట్ర అధ్యక్షుడిని ఖరారుచేసిన బిజెపి హైకమాండ్ తెలంగాణ పై మాత్రం అమ్మో.. తెలంగాణ అంటూ భయపడుతోంది. తూకంలో తేడాలొస్తే మళ్ళీ ధమాల్ అని పడిపోతామని ఆందోళన చెందుతోంది. అందుకే జాతీయ అధ్యక్షుడి ఎంపిక కంటే కూడా.. తెలంగాణ అధ్యక్షుడి ఎంపికే కష్టంగా బిజెపి అధిష్టానం భావిస్తోంది.

# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

- **జూన్ 15 నుండి జూన్ 30 మధ్య టెట్ ఎగ్జామ్స్**
- **ఈ నెల 15 నుండి 30 వరకు ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ**
- **జూలై 22న ఫలితాలు**

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది టెట్ పరీక్షలు జూన్ 15 నుండి 30 మధ్య నిర్వహించనున్నారు. అధికారికంగా విడుదలైన షెడ్యూల్ ప్రకారం, ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. అభ్యర్థులు అధికారిక వెబ్సైట్ ద్వారా మాత్రమే అప్లికేషన్ ఫారాన్ని సమర్పించాల్సి ఉంటుంది.

**పరీక్ష వివరాలు**

ఈసారి టెట్ పరీక్ష పూర్తిగా ఆన్లైన్ మోడ్ లో నిర్వహించనున్నారు. అంటే అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత పరీక్ష రాయాల్సి ఉంటుంది.

**టెట్లో రెండు పేపర్లు ఉంటాయి.**

పేపర్ 1: ప్రాథమిక స్థాయి టీచర్ల (క్లాస్ 1 to 5) కోసం. పేపర్ 2: ప్రాథమికోన్నత స్థాయి టీచర్ల (క్లాస్ 6 to 8) కోసం. అభ్యర్థులు ఒక్క పేపరుకి గానూ రూ. 750 ఫీజు చెల్లించాలి. రెండు పేపర్లకు హాజరయ్యే అభ్యర్థులు రూ. 1000 చెల్లించాలి.

**ఫలితాల విడుదల**

తెలంగాణ టెట్ పరీక్ష ఫలితాలను జూలై 22వ తేదీన విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరీక్ష ఫలితాల ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హతను నిర్ధారిస్తారు.

**అభ్యర్థులకు సూచనలు**

విద్యార్థులు అధికారిక నోటిఫికేషన్ను జాగ్రత్తగా చదివి, అవసరమైన అర్హతలు, వయోపరిమితి, ఫీజు వివరాలు, పరీక్షా విధానం తదితర వివరాలు తెలుసుకొని మాత్రమే దరఖాస్తు చేయాలి. అలాగే, పరీక్షకు అవసరమైన సిలబస్ను బట్టి ముందుగానే సిద్ధమవ్వడం మంచిది.

# హెచ్ఆర్సీ చైర్ పర్సన్గా జస్టిస్ షమీమ్ అక్తర్

## లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖరరెడ్డి

### ఉత్తర్వులు జారీ.. ఇద్దరిదీ నల్లగొండ నేపథ్యమే





(మొదటి పేజీ తరువాయి)

తొలుత మహమూద్ అలీ వద్ద ప్రాక్టీస్ చేశారు. నాలుగేళ్ల తర్వాత స్వతంత్రంగా ప్రాక్టీస్ మొదలెట్టారు. 2004లో హైకోర్టు న్యాయవాదుల సంఘం (హెచ్సీఏఏ) ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2004లో కేంద్ర ప్రభుత్వానికి సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్గా, 2005లో అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్గా నియమితులయ్యారు. సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సర్వీస్ టాక్స్కు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్గా కూడా పని చేశారు. 2013, ఏప్రిల్ 12న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన.. 2014లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022, ఏప్రిల్లో పదవీ విరమణ చేశారు. లోకాయుక్తగా నియామకం ఐన జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డిని 2024 జూన్లో ప్రభుత్వం తెలంగాణ 'రెరా' అప్పిలేట్ ట్రిబ్యునల్ చైరపర్సన్గా నియమించింది. ఆయన ఈ పోస్టుకు రాజీనామా చేసి లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించనున్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ 1961, జనవరి 1న నల్లగొండలో రహీమున్నీసా బేగం, జాన్ మహమ్మద్కు జన్మించారు. నల్లగొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ చదివారు. నాగ్పూర్లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా నుంచి న్యాయపట్టా పొందారు. 1996లో హైదరాబాద్ బషీర్బాగ్లోని పీజీ కాలేజ్ ఆఫ్ లా నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2006లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. 2002లో నల్లగొండ జిల్లా, సెషన్స్ జడ్జిగా నియమితులయ్యారు. తర్వాత పలు కోర్టుల్లో పనిచేసిన ఆయన ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ ట్రిబ్యునల్ ప్రిసైడింగ్ ఆఫీసర్గా, ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ అదనపు డైరెక్టర్గా విధులు నిర్వహించారు. హైకోర్టులో రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)గా పనిచేశారు. 2017లో హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. 2022 డిసెంబర్లో పదవీ విరమణ చేశారు. ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్తో ప్రభుత్వం ఇటీవల ఏకసభ్య కమిషన్ను ఏర్పాటు చేయడంతోపాటు కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగానే వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించింది.

# త్రిష ఫైర్

- **బురదజల్లడమే మీ పనా?**
- **మిమ్మల్ని చూస్తుంటే భయమేస్తోంది**
- **సోషల్ మీడియా నెగిటెవిటీపై ఆగ్రహం**

**మహా:** సామాజిక మాధ్యమాల్లో నెగెటివిటీని వ్యాప్తి చేసే వారిపై నటి త్రిష అసహనం వ్యక్తం చేశారు. ఇంతటి విషపూరితమైన స్వభావంతో ఎలా ప్రశాంతంగా ఉంటున్నారని మండిపడ్డారు. ఇతరులపై బురద జల్లడమే వారి పని అని పేర్కొన్నారు. "విషపూరితమైన వ్యక్తులు... అసలు మీరెలా జీవిస్తున్నారు... మీకు ప్రశాంతంగా నిద్ర ఎలా పడుతుంది. ఖాళీగా కూర్చొని ఇతరులపై బురద జల్లడమే మీ పని. సోషల్మీడియాలో పిచ్చిపిచ్చి పోస్టులతో రాక్షసానందం పొందుతున్నారు. మిమ్మల్ని చూస్తుంటే నిజంగా భయమేస్తుంది. నిజం చెప్పాలంటే మీది పిరికితనం. ఆ దేవుడి ఆశీస్సులు మీకు ఉండాలని కోరుకుంటున్నా" అని త్రిష ఇన్స్టా స్టోరీలో రాసుకొచ్చారు. కాగా, గతంలోనూ త్రిష ఈ విధంగా తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే వారిపై సోషల్ మీడియా వేదికగా పోస్టుల ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పనీపాట లేని వారి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అప్పట్లో ధ్వజమెత్తారు. ఇక తాజాగా పోస్టు పెట్టడానికి కారణం... ఆమె నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీ గురువారం నాడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీలోని ఆమె పాత్రను కొంతమంది మెచ్చుకుంటే, మరికొంత మంది విమర్శించారు. ఆమె నటన ఏమీ బాలేదని, తమిళం తెలిసిన ఆమె తన పాత్రకు వేరే వారితో డబ్బింగ్ చెప్పించడం ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు త్రిష గురించి నెగెటివ్ పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె స్పందించారు.



# తెలంగాణ బీజేపీలో చిలక జ్యోతిష్యులు

- **పార్టీ అధ్యక్షుడిని ఎంపిక చేయడమే చేతకాదు**
- **గురివింద ఆరోపణలు చేస్తున్నారు**
- **ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఫైర్**

**హైదరాబాద్, మహా:** పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని ఎంపిక చేయడానికి చేతకాని మీరు ముఖ్యమంత్రి మార్పు గురించి చెబుతున్నారా..? అంటూ బీజేపీపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా ఏఐసీసీ ఆఫీస్ గోడకు చెవులు పెట్టి వింటున్నారని ఆయన శుక్రవారం విమర్శించారు. తెలంగాణ బీజేపీలో చిలుక జ్యోతిష్యులు ఎక్కువయ్యారని ఆది శ్రీనివాస్ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిని మారుస్తున్నారంటు నోటికొచ్చినట్లు వాగుతున్నారని, పార్టీ అధ్యక్ష పదవి సంపాదించడం కోసం ఇలా మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణ బీజేపీలోని లుకలుకలు ఎమ్మెల్యే రాజా సింగ్ రోజూ బయటపడుతూనే ఉన్నారని, ముందు వాటి గురించి ఆలోచించుకోండని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. సంచలనం కోసం ధర్మపురి అర్వింద్ చిలుక జ్యోతిష్యం చెబుతున్నారని, ఆయనలా వసూళ్లు చేయాల్సిన కర్మ తమకు పట్టలేదన్నారు. ఈ దేశంలో వసూళ్ల పార్టీ ఏదో ఎన్నికల సంఘం లెక్కలు చెపుతూనే ఉన్నాయన్నారు. 8 వేల మంది కార్పొరేట్ వ్యక్తుల నుంచి ఏకంగా రూ.2,243 కోట్ల విరాళాలు బీజేపీకి వచ్చి పడ్డాయని, మీరు వసూళ్లు చేయకపోతే ఇన్ని డబ్బులు ఎలా వచ్చాయో ధర్మపురి అర్వింద్ చెప్పాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేపర్ పులి అని అర్వింద్ అంటున్నాడని, అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తు చిత్తు గా ఓడిపోయిన కేసీఆర్ , కిషన్ రెడ్డిల ని అడుగు రేవంత్ రెడ్డి అంటే ఏమిటో తెలుస్తుందన్నారు. ప్రధాని అయిన 11 యేళ్లలో కనీసం ఒక్క ప్రెస్ మీట్ కూడా పెట్టలేకపోయిన నరేంద్ర మోదీ పులినా, లేక పిల్లి నా..? అని ఆయన ప్రశ్నించారు.

### మూసీ పునరుజ్జీవన పనులు

# వేగవంతం చేయండి

### మీర్ అలం ట్యాంక్ పై బ్రిడ్జి అద్భుతంగా నిర్మించాలి

### 3 ప్రాంతాల్లో ఐలాండ్ లను తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాపూఘాట్ లో నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్ తో పాటు మీర్ అలం ట్యాంక్ పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సీఎం పరిశీలించారు. మీర్ అలం ట్యాంక్ పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్ లో టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ తో పాటు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జేఎండి గౌతమి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మీర్ అలం ట్యాంక్ పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలని, అదే సమయంలో సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్ లో వివిధ చోట్ల ఐలాండ్ లా ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

**సింగపూర్ లోని గార్డెన్స్ బై ది బే తరహాలో**

సింగపూర్ లోని గార్డెన్స్ బై ది బే ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వెడ్డింగ్ డెస్టినేషన్ కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్ను ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు. బోటింగ్ తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలని సూచించారు. ట్యాంక్ లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్ ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలని చెప్పారు. పీపీపీ మోడల్ లో ఈ ఐలాండ్ జోన్ ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మీర్ అలం ట్యాంక్ లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీ తో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలని, ఆ నివేదికల ఆధారంగా అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మీర్ అలం బ్రిడ్జితో పాటు ఈ ఐలాండ్ జోన్ ను పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇక్కడి డెవెలప్ మెంట్ ప్లాన్ ను దృష్టిలో పెట్టుకొని జూ పార్కును అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్ గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా అభివృద్ధి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు.

# తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్?

(మొదటి పేజీ తరువాయి)



గతేడాది జూలై నెలలో 1992 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన జితేందర్ నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవీకాలం మరో ఐదు నెలల్లో ముగియనుండడంతో నూతన డీజీపీ ఎంపికకు ఇప్పటి నుంచే కసరత్తు మొదలైంది. ఈ పదవిని దక్కించుకునేందుకు ఎవరికి వారుగా తమ ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. సీనియార్టీ జాబితా ప్రకారం రవిగుప్తా (1990), సీవీ ఆనంద్ (1991), కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి (1994), బీ శివధర్ రెడ్డి (1994), సౌమ్యా మిశ్రా (1994), శిఖా గోయల్ (1994) పోటీలో ఉన్నారని సమాచారం. రవిగుప్తా రాష్ట్ర హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా, ఆనంద్ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్గా పనిచేస్తున్నారు. ఇక శివధర్ రెడ్డి ఇంటెలిజెన్స్ ఏడీజీగా ఉన్నారు. సౌమ్యా మిశ్రా డీజీ (జైళ్లు), శిఖా గోయల్ సీఐడీ అడిషనల్ డీజీపీగా కొనసాగుతున్నారు. సెక్రటరీ రవిగుప్తా ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. ఆ తరువాతి స్థానంలో సీవీ ఆనంద్ ఉన్నారు. ఆనంద్కు 2028 జూలై వరకు సర్వీసు ఉండటం కలిసి వచ్చే అవకాశంగా చెబుతున్నారు. కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఈ ఏడాది పదవీ విరమణ చేస్తుండగా, శివధర్ రెడ్డి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలలో, సౌమ్యా మిశ్రా 2027 డిసెంబర్ చివరన, శిఖా గోయల్ 2029 మార్చి నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. ఆనంద్, శివధర్ రెడ్డి స్థానికులు కావడం మూలంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి వీరిద్దరిలో ఒకరిని డీజీపీగా ఎంపిక చేసేందుకు మొగ్గు చూపవచ్చని పోలీసు ఉన్నతాధికారుల్లో చర్చలు నడుస్తున్నాయి.

**సౌమ్యుడిగా ఆనంద్ కు ముద్ర**

ఆనంద్కు రాష్ట్ర సర్వీసులతో పాటు కేంద్ర సర్వీసులో పనిచేసిన అనుభవం కూడా ఉన్నది. పైగా సౌమ్యుడనే ముద్ర ఉంది. ఏ ఒక్కరికీ అనుకూలంగా వ్యవహరించకుండా చట్టపరిధిలో వ్యవహరిస్తారనే పేరుండటం అదనపు అర్హతగా ఉన్నతాధికారులు చెబుతున్నారు. సాధారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ డీజీపీ పదవికి మూడు పేర్లను మాత్రమే సిఫారసు చేస్తుంది. కానీ ఈసారి ఐదుగురి పేర్లను యూపీఎస్సీకి సిఫారసు చేస్తున్నట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన పేర్లను పరిశీలించిన యూపీఎస్సీ.. కేంద్ర హోం శాఖకు సిఫారసు చేసింది. అందులో ఒకరిని ఎంపిక చేసి తిరిగి రాష్ట్రానికి పంపించడం ఆనవాయితీగా వస్తుంది. పేరును ఖరారు చేసే ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి అభిప్రాయాన్ని హోం శాఖ పరిగణనలోకి తీసుకుటుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. జాబితా సిద్ధం చేసే నాటికి రిటైర్మెంట్కు కనీసం ఆరు నెలల సర్వీసు ఉండాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) 2023 నవంబర్ నెలలో నిబంధన కొత్తగా తీసుకువచ్చింది.

# సన్నబియ్యం పథకం దేశంలోనే నెంబర్ వన్

(మొదటి పేజీ తరువాయి)



మంచి ఫైన్ రైస్ బిఆరెస్ బీజేపీ ఇచ్చారా..అలాంటి వారి కోసం మాట్లాడం కరెక్టు కాదన్నారు. 2.8 కోట్ల జనాభాకు దొడ్డు బియ్యం ఇస్తూ.. 10 వేల కోట్లు గతం లో ఖర్చు చేశారని, 3.10 కోట్ల మంది లబ్ధిదారులకు సన్నబియ్యం ఇవ్వడానికి 13 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. గతంలో నాణ్యత సరిగా లేకపోవడం వల్ల ఎవరు తినకపోయేవారని, తమ ప్రభుత్వం విప్లవాత్మక మార్పు తీసుకువస్తున్నదన్నారు. గతానికంటే ఖర్చు అధికంగా చేస్తున్నామన్నారు. నిరుపేదల కడుపు నింపడానికి ఖర్చు చేస్తున్నామని, సన్నబియ్యం పథకం లోతుగా జనాల్లోకి తీసుకుని వెళ్ళాలి అని నాయకులను కోరామన్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత రికార్డ్ స్థాయి పంట 66.7 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం పండిందని, 10 ఏండ్ల బీఆర్ఎస్ హయాంలో పండని పంట కాంగ్రెస్ హయాంలో పండిందన్నారు. రైతు పక్షపాత ప్రభుత్వం అని చెప్పడానికి పండిన పంట నిదర్శనమన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో కమిటెడ్ గా ఉన్నామని, సరైన ధర కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంఎస్పి , బోనస్ కి కోట్ల రూపాయల డబ్బు ఖర్చు చేస్తున్నామన్నారు.

# కేసీఆర్ కుటుంబంపై సీబీఐ విచారణ జరపాలి

- బీఆర్ఎస్ పాలనలో దోపిడీపై చర్చకు సిద్ధమా?
- కేటీఆర్ దమ్ముంటే చర్చకు రావాలి
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సవాల్
- సీఎంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం



**హైదరాబాద్, మహా :** హెచ్‌సీయూ భూముల వివాదంలో బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండి పడ్డారు. ఈ మేరకు గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలోజరిగిన భూదోపిడి మీద చర్చకు సిద్ధమా అంటూ ప్రశ్నించారు. దమ్ముధైర్యం ఉంటే చర్చకు రావాలని సవాలు విసిరారు.కేసీఆర్ కుటుంబంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బంగారం లాంటి భూములను గతంలోనే బీఆర్ఎస్ నాయకులు అమ్ముకున్న విషయం మర్చి పోయారా అని ఆయన ప్రశ్నించారు. ఆ భూములను సొంత నేతలకే అమ్ముకున్నారని ఆరోపించారు. కరప్షన్ కు కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబమని, లిక్కర్ స్కాం చేసింది కేసీఆర్ కుటుంబమని ఆయన ఆరోపించారు. కేటీఆర్ దిగజారి మారుతున్నారని, అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారని తెలంగాణ ప్రజలు నమ్మద్దు అంటూ ఆయన పిలుపునిచ్చారు. అత్యంత తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడి చేసింది కేసీఆర్ కుటుంబమేనన్నారు మహేశ్ కుమార్. కేసీఆర్ కుటుంబంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో హైదరాబాద్ భూములను మాయాజాలం చేసి ఎకరా రూ.100 కోట్లకు అమ్ముకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లోనే 10 వేలకుపై చిలుకు భూములను అడ్డగోలుగా అమ్ముకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. కేసీఆర్..హెచ్‌సీయూ భూములతో పాటు పలు యూనివర్సిటీలకు చెందని భూములను కూడా దోచుకోవాలని చూశారని ఆరోపించారు.ఐఎంజీ భరత్ సంస్థతో 33 శాతం ముడుపులు తీసుకునేలా అప్పటి మంత్రి కేటీఆర్ మాట్లాడుకున్నారని తెలిపారు. కేటీఆర్‌కు రావాల్సిన ముడుపులు రూ.5,200 కోట్లను కాంగ్రెస్‌కు అంటగడ్డే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపోతే రూ.5,200 కోట్లు తీసుకుని హెచ్‌సీయూ భూములను బిల్లీరావుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పన్నంగా అప్పగించేదని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. హెచ్‌సీయూ భూములు ప్రభుత్వానివని, ఇందుకు బదులుగా 390 ఎకరాలు అప్పట్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. హెచ్‌సీయూ భూములను కాపాడింది రాజశేఖర్ రెడ్డి అని, వెనక్కి తీసుకొచ్చింది సీఎం రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ దోపిడీని భరించలేకనే కాంగ్రెస్ పార్టీని గెలిపించారని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

**కేటీఆర్ సగంసగం తెలుసుకుని మాట్లాడుతున్నారు**

కేటీఆర్ గుంటూరులో ఏం చదువు నేర్చుకున్నాడో ..సగం సగం తెలుసుకొని రాజకీయలబ్ది కోసం కేటీఆర్ మాట్లాడుతున్నారంటూ మహేష్‌గౌడ్ ఎద్దేవా చేశారు. బీసీ కుల గణన వల్ల బీఆర్ఎస్ పార్టీకి వణుకు పుట్టిందన్న ఆయన రైతులు బాగు పడుతుంటే కేటీఆర్ కి కడుపు నొప్పి వస్తోందన్నారు. ఏఐ టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారని పీసీసీ చీఫ్ ఆరోపించారు.





# మహాత్మ జ్యోతిబా పూలేకు సీఎం నివాళి

## నెక్లెస్ రోడ్డులో విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం

**హైదరాబాద్, మహా:** మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం ఏర్పాటు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. పూలే జయంతి రోజే హైదరాబాద్ నెక్లెస్ రోడ్ ఐమాక్స్ సమీపంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులతో కలిసి సీఎం స్థలాన్ని పరిశీలించారు. భవిష్యత్‌లో ట్రాఫిక్ తదితర సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని డిజైనింగ్ రూపకల్పన చేయాలని చేయాలని సూచించారు.

**పూలే విగ్రహానికి పూలమాల వేసి..**

ఇవాళ మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా అంబర్‌పేటలో ఆయన విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, నియోజకవర్గ ఇన్‌చార్జి రోహిన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# దమ్ముంటే ఆ ఎంపీ పేరు బయటపెట్టు

**.. కేటీఆర్‌కు ఏలేటి కౌంటర్**

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమికి సంబంధించి బీఆర్ఎస్ నేత కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణలపై తెలంగాణ బీజేపీ కీలక నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పందించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేటీఆర్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్‌కు బట్టకాల్చి మీదేయడం ఎప్పటినుంచో అలవాటని విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ కుంభకోణంలో బీజేపీ ఎంపీ హస్తం ఉందనే ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. దమ్ముంటే.. ఆ ఎంపీ ఎవరో పేరు బయటపెట్టాలని ఏలేటి డిమాండ్ చేశారు. ఆధారాలు ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటామని కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీని బద్నాం చేయాలనేదే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఉమ్మడి లక్ష్యమన్నారు.

# 14న భూ భారతి ఆవిష్కరణ

## శిల్పకళావేదికలో కార్యక్రమం

తెలంగాణ భూ భారతి(రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్) యాక్ట్, 2025 ఆవిష్కరణకు రంగం సిద్ధమైంది. ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భూ భారతి చట్టం ప్రొవిజన్స్‌తో కొత్త పోర్టల్‌ని ప్రారంభించనున్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి రోజునే సామాన్య రైతులకు భూసేవలను సులభం చేసే భూభారతి ప్రారంభిస్తున్నారు. శిల్ప కళావేదికలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్లను సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఆదేశించారు.

# కేంద్ర పథకాలకు సీఎం రేవంత్ ఫోటో పెట్టాలి

## తెలంగాణ సొమ్ము లేకుండా కేంద్ర పథకాలెక్కడివి?

బిజెపిపై మంత్రి తుమ్మల విసుర్లు .. సిరిసిల్ల టెక్స్ పోర్ట్ యూనిట్ ప్రారంభం

800మంది మహిళలకు నియామక పత్రాలు అందించిన మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు, పొన్నం



**సిరిసిల్ల, మహా:** రాజన్న సిరిసిల్లా జిల్లాలో టెక్స్ పోర్ట్ యూనిట్ ప్రారంభం అయింది. టెక్స్ పోర్ట్ యూనిట్ ను తెలంగాణ రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. బారతదేశంలో మొట్ట మొదటిసారిగా సిరిసిల్లలో టెక్స్ పోర్ట్ యూనిట్ ప్రారంభం అయింది. తెలంగాణలో మహిళలకు ఉపాధి నిమిత్తం టెక్స్ పోర్ట్ యూనిట్ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించి, 800 మంది మహిళలకి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు . ఉద్యోగ శిక్షణనిచ్చి ట్రైనింగ్ సమయంలో స్టైఫండ్ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం సిరిసిల్లలోనే టెక్స్ పోర్ట్‌లో ఉద్యోగం లభించనుంది.

**మేం పన్నులు కడుతున్నాం.. మా సీఎం ఫొటో పెట్టాలి**

. అదేవిధంగా రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫోటో పెట్టాలని బిజెపి నేతలు చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘాటుగా స్పందించారు.. ఇది నీ అబ్బ సొత్తు కాదు.. మా అబ్బ సొత్తు కాదు.. కేంద్రానికి 70 పైసలు ఇస్తే.. 30 పైసలు ఇస్తున్నారు.. కేంద్రాన్ని కాపాడేది రాష్ట్ర ప్రభుత్వాలే అని ఫైర్ అయ్యారు. కేంద్రం నిధులిస్తుందట.. ఎవరిదో ఫోటో పెట్టాలంటా.. మేము కూడా పన్నులు కడుతున్నాము.. కేంద్ర పథకాలకు మా సీఎం ఫొటో పెట్టాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు.

# తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ పొత్తు

## ప్రకటించిన అమిత్ షా.. సీఎం అభ్యర్థిగా పళని స్వామి



**మహా:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ అన్నాడీఎంకే , బీజేపీ పొత్తు ఖరారైంది. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా ప్రకటించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేస్తామని తెలిపారు. తమిళనాడు పర్యటనలో ఉన్న అమిత్ షా.. చెన్నైలో ప్రెస్ మీట్ పెట్టారు. అన్నాడీఎంకే చీఫ్, మాజీ సీఎం పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర ప్రస్తుత అధ్యక్షుడు అన్నామలైతో కలిసి మీడియాతో ముచ్చటించారు. పళనిస్వామి సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్తామని ప్రకటించారు. అంతేకాకుండా కనీస ఉమ్మడి కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తామని అమిత్ షా తెలిపారు. 1998లో లోక్‌సభ ఎన్నికల సమయంలో అప్పటి సీఎం జయలలిత నేతృత్వంలో బీజేపీ, అన్నాడీఎంకే కూటమిగా ఏర్పడి భారీ విజయాన్ని సాధించామని షా గుర్తు చేశారు. బీజేపీఏఐఏడీఎంకే కూటమి 39 లోక్‌సభ స్థానాల్లో 30 స్థానాలను గెలుచుకుందని అన్నారు. తమిళనాడులో ఎన్డీఏ కూటమి గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. పొత్తు కోసం అన్నాడీఎంకే ఎలాంటి డిమాండ్లు, షరతలు పెట్టలేదని అన్నారు. అన్నాడీఎంకే పార్టీ అంతర్గత వ్యవహారాల్లో బీజేపీ జోక్యం చేసుకోదన్నారు. అమిత్ షా ప్రజలను అభ్యర్థిస్తూ.. కొన్ని విషయాలను బీజేపీ స్వయంగా నిర్వహించుకోవడానికి అనుమతించాలని అన్నారు. అన్నాడీఎంకే పై అధిక భారం మోపవద్దని కోరారు. తమిళనాడులో డీఎంకే అసలైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సనాతన ధర్మం, త్రిభాషా విధానం వంటి అంశాలను తెరపైకి తీసుకొస్తోందని అమిత్ షా విమర్శించారు.

**బీజేపీ తమిళనాడు చీఫ్ గా నాగేంద్రన్**

మరోవైపు, తమిళనాడు కొత్త చీఫ్ ఎన్నిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం నైనార్ నాగేంద్రన్ నామినేషన్ దాఖలు చేశారు. తమిళనాడు బీజేపీ అధ్యక్ష ఎన్నికల బరిలో ఈసారి ఉండబోనని అన్నామలై ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఆ పదవికి తిరునల్వేలి బీజేపీ ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా ఆయన కొనసాగుతున్నారు. టి.నగర్‌లోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి విచ్చేసి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలుచేశారు. దీంతో, ఆయన ఎన్నిక లాంఛనమేనని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర అధ్యక్ష పదవికి నాగేంద్రన్ పేరును కె.అన్నామలై, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, కేంద్ర మాజీ మంత్రి పోన్ రాధాకృష్ణన్‌తో పాటు, మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ ప్రతిపాదించారు. తమిళనాడు బిజెపి చీఫ్‌గా బాధ్యతలు చేపట్టనున్నన నైనార్ నాగేంద్రన్ 2001, 2011లో అన్నాడీఎంకే తరపున తిరునెల్వేలి అసెంబ్లీ స్థానాన్ని గెలుచుకున్నారు. ఆ తర్వాత 2017లో ఆయన అన్నాడీఎంకేను వీడి బీజేపీలో చేరారు.

# భారత్ కు చెందిన రెండు సంస్థలపై అమెరికా ఆంక్షలు



**మహా:** భారత్ కు చెందిన వ్యక్తిపై, రెండు సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ విషయాన్ని యూఎస్ ట్రెజరరీ విభాగం ప్రకటించింది. ఇరాన్ ఆయిల్ సరఫరాకు సాయం చేస్తున్న ఆరోపణలపై చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. భారత్‌కు చెందిన జగ్వీందర్ సింగ్ బరార్ కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పలు వ్యాపారాలు ఉన్నాయి. ఆయన కంపెనీలు దాదాపు 30 నౌకలను నిర్వహిస్తున్నాయి. దీంతోపాటు భారత్‌లోని గ్లోబల్ ట్యాంకర్స్ ప్రైవేట్ లిమిటెడ్, బి అండ్ పీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో జగ్వీందర్ బరార్ కు కంట్రోల్ ఉంది. అయితే, బరార్ కు చెందిన నౌకలు.. ఇరాన్ 'షాడో ఫ్లీట్'లో భాగంగా పనిచేస్తున్నాయని అమెరికా ఆరోపించింది. ఈ కార్గోల ద్వారా ఇరాన్ చమురును మారుపేరుతో అక్రమంగా అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేస్తున్నాయని పేర్కొంది. దీంతో జగ్వీందర్‌తో పాటు, భారత్‌కు చెందిన ఆయన కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది.

**హౌతీలతో సంబంధాలు..!**

అంతేగాక, బరార్ కు హౌతీలతోనూ ఆర్థిక సంబంధాలున్నాయని యూఎస్ ట్రెజరరీ విభాగం పేర్కొంది. బరార్‌కు చెందిన కార్గోలు ముప్పు కలిగించే ఆయిల్ సప్లయ్ లో పాల్గొంటున్నాయని ఆరోపించింది. ఇరాన్ పెట్రోలియంను ఇరాక్, యూఏఈ, గల్ఫ్ ఆఫ్ ఒమన్ జలాల్లో తరలిస్తున్నాయింది. ఈ కార్గోలను అందుకున్న ఇతర సంస్థలు.. వేరే దేశాల నుంచి తీసుకొచ్చిన చమురు ఉత్పత్తులతో వీటిని కలుపుతున్నాయని పేర్కొంది. ఇరాన్ పేరును దాచిపెట్టి నకిలీ పత్రాలతో అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయిస్తున్నట్లు అని అమెరికా అధికారులు ఆరోపించారు. అందుకే ఆంక్షలు విధించినట్లు తెలిపారు. కాగా.. ఇలాంటి ఆరోపణలతో గతంలోనూ కొన్ని సంస్థలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది

# పేదోడి కడుపునింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**మణుగూరు, మహా:** పేదోడి కడుపునింపడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, సన్నబియ్యం పథకం దేశంలోనే విప్లవాత్మకమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పినపాక నియోజకవర్గంలోని భూర్గంపహాడ్, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాలలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మణుగూరు మండలంలోని ప్రజా భవన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి కడుపు నిండా అన్నం పెట్టాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వం లక్షమన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందజేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం అమలు చేశామన్నారు. అంతేగాక పేదలకు 500లకే గ్యాస్ సిలిండర్ అమలు చేస్తామని తెలిపారు. రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. అలాగే గృహ జ్యోతి పథకం కింద పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 10 లక్షల రూపాయలు ప్రతి పేదవాడికి ఉపయోగపడుతున్నాయన్నారు. ఇచ్చిన ఆరు పథకాలలో ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామన్నారు. నిజానికి రాష్ట్రం డబ్బు లేకపోయినా ఏదో విధంగా కష్టపడి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. గత 10 ఏండ్లు పరిపాలించిన దొరవారు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి పోయారని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం పేరుతో లక్షల కోట్ల రూపాయలు మింగేశారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మించి కాళేశ్వరం నీరు ద్వారా ఏ ఒక్క రైతు బాగుపడలేదన్నారు. రైతుని రాజును చేస్తానని చెప్పి రైతుని ఆ కాళేశ్వరంలో ముంచి వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలో రైతుకి కష్టాలు రాకుండా చేయడమే ఇందిరమ్మ ప్రథమ లక్ష్యమన్నారు. పినపాక ఏజెన్సీ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన బీటీ రోడ్లు నిర్మిస్తామన్నారు. ప్రాజెక్టు బ్రిడ్జిలకు కొత్తతరహా తెస్తాం అన్నారు. పులుసుబొంతా ప్రాజెక్టును కూడా నిర్మించి సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తామన్నారు. ప్రాజెక్టు కింద పోయే పంట పొలాల రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంపై గత పాలకులు ఎన్ని విమర్శలు చేసిన అవేవి పట్టించుకోకుండా ప్రజలకు ఇచ్చిన హామీల పైనే ఫోకస్ పెట్టామన్నారు. ప్రతి పేదవాడి కుటుంబానికి ఇందిరమ్మ ప్రభుత్వం అండగా ఉంటుందని, మిగిలిన హామీలను కూడా త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. రాజీవ్ వికాస్ పథకాన్ని ప్రతి పేద కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మంత్రి పర్యటనలో ఎంపీ బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, భద్రాచలం ఐటీడీఏ పీవో బీ.రాహుల్, డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మండల అధ్యక్షుడు నవీన్, , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ, పంచాయతీ, మిషన్ భగీరథ, విద్యా శాఖ, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# హెచ్ సియు భూముల వెనుక రూ.10 వేల కోట్ల స్కామ్

## ఆ బీజేపీ ఎంపీ సహకరిస్తున్నాడు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ



**హైదరాబాద్, మహా:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 'మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం' అనే 3డీ మంత్రాన్ని అమలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కంచ బౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం విస్తుపోయిందని తెలిపారు. హెచ్ సియు లోని 400 ఎకరాలు అటవీ భూమేనని సుప్రీంకోర్టు ఆధారంగానే తాను ఈ విషయాన్ని చెబుతున్నట్లు పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వం రూ.10 వేల కోట్ల స్కామ్‌కు ప్రయత్నిస్తోంది. సీఎంకు బీజేపీకి చెందిన ఓ ఎంపీ వెనుక నుంచి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారు. ఓ బ్రోకరేజ్ కంపెనీతో చర్చలు జరిపారు. ఎఫ్ ఆర్ బిఎంను బైపాస్ చేసి డబ్బులు ఇస్తామని.. ఆ తర్వాత భూములు అమ్ముకోవచ్చని చెప్పింది. ఇందుకోసం ఏకంగా ఆర్‌బీఐ నిబంధనలు, చట్టాలు, సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కారు. రేవంత్.. తనకు అండగా ఉన్న బీజేపీ ఎంపీకి లబ్ధి చేకూరుస్తున్నారు. స్కామ్‌కు సహకరించిన ఎంపీ పేరును వచ్చే ఎపిసోడ్‌లో చెబుతా. అన్ని ఆధారాలతో దీనిపై కేంద్రానికి లేఖ రాస్తా. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి తెలియకుండా ఇది జరిగిందని అనుకుంటున్నాను. రేవంత్ కేవల 400 ఎకరాలు మాత్రమే కాదు. రూ.60 వేల కోట్ల విలువైన హెచ్‌ఎండిఏ భూముల ద్వారా కూడా దోపిడి చేసేందుకు ప్లాన్ వేశారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై విచారణకు ఆదేశించాలని'' కేటీఆర్ డిమాండ్ చేశారు.

# అధికారుల తప్పులు.. సర్కారుకు తిప్పలు

**"ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోడానికి ముందే సమగ్రంగా రివ్యూ చేయడం, భాగస్వాములతో చర్చలు జరపడం, ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందులను అంచనా వేయడం, విమర్శలు వస్తే తిప్పికొట్టడానికి తగిన వ్యూహాన్ని రూపొందించుకోవడం ఇలాంటివన్నీ అతి కీలకం. కానీ అధికారులు ప్రభుత్వానికి సరైన ఫీడ్ బ్యాక్ ఇవ్వకనోవడం, క్షేత్రస్థాయిలో పథకం లేదా కార్యక్రమంపై ప్రజలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయకపోవడంతో మంచి కార్యక్రమాలు చేసి కూడా విమర్శలు మూటగట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వ నిర్ణయాలపై రాద్దాంతానికి ప్రతిపక్షాలు ఎపుడూ సిద్ధంగా ఉంటాయి. దీనిని గమనంలో ఉంచుకుని.. ప్రజలకు వాస్తవాలు వివరించడం, పథకం ఫలాలు ప్రజలకు చేర్చడం అధికార యంత్రాంగం బాధ్యత**



- గడ్డం క్రిష్ణమూర్తి,
సీనియర్ జర్నలిస్ట్, అసోసియేట్ ఎడిటర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 16 మాసాలు కావస్తుంది. పాలనపై పట్టు సాధించడం, అధికారుల పనితీరును బేరీజు వేసేందుకు ఈ సమయం సరిపోతుంది. వాస్తవానికి పాలకులు ఐదేళ్ళకు వస్తుంటారు, పోతుంటారు. ప్రజాస్వామ్యంలో ఇది సహజం. కానీ అధికారులు పాలకులెవరైనా తమ పనులను తాము చేయాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రంలో అందుకు విరుద్ధంగా పాలన సాగుతుందేమో అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాల్లో కొన్ని ఆశించిన ఫలితాలు రాకపోగా, భిన్నంగా ప్రతికూలంగా మారడం చర్చకు దారితీసింది. క్షేత్రస్థాయి సమస్యలను సరిగ్గా అంచనా వేయడంలో వైఫల్యం ఉంటున్నదని, ఆ కారణం గానే కార్యాచరణలో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని సీనియర్ అధి కారుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఒక నిర్ణయాన్ని తీసుకున్న తర్వాత ప్రజలకు అర్థమయ్యే తీరులో తొలుత ప్రచారం లోకి తీసుకెళ్లడంలో స్పష్టత కొరవడిందని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. ఈ కారణంగా నే చివరకు ప్రజాందోళనలు, విపక్షాల విమర్శలు, న్యాయ స్థానాల వరకూ వెళ్తున్నాయని గుర్తు చేశారు. సీఎంఓలో పూర్వానుభవం ఉన్న అధికారులుంటే ఈ సమస్యలు ఉత్పన్నమయ్యేవి కావని అంటున్నారు. అయితే వాస్తవానికి ప్రభుత్వాన్ని గైడ్ చేయడంలో ఆఫీసర్లు ఫెయిల్ అవుతున్నారని, చివరకు ఆశించిన లక్ష్యానికి మధ్యలోనే బ్రేకులు పడుతున్నాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. లగచర్ల భూ సేకరణ విషయంలో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిందన్న ఆరోపణలు వినిపించాయి. చివరకు కలెక్టర్ పై దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. జీవో జారీ చేసిన తర్వాత హైకోర్టు జోక్యం చేసుకోవాల్సి రావడం, చివరకు ఆ ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహ రించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. తాజాగా కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల విషయంలోనూ సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని ఆంక్షలు విధించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. హైడ్రా వ్యవస్థను తీసుకొచ్చిన కొత్తలో సైతం మూసీ ఒడ్డున ఉన్న ఇండ్లకు రెడ్ మార్కింగ్ వేయడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. హైడ్రా నిర్ణయాన్ని సవాల్ చేస్తూ చాలా మంది కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసి ముకుతాడు వేయించారు.



మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ విషయంలోనూ ప్రభుత్వం ఒక నిర్ణయాన్ని తీసుకున్న తర్వాత ప్రజలకు అంతే స్థాయిలో స్పష్టతను కలిగించడంలో లోపమున్నదన్న అభిప్రాయం వ్యక్తమైంది. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు విషయంలోనూ అధికారుల్లో స్పష్టత కొరవడటంతో తొలుత 'సుందరీ కరణ గా చెప్పారు. విపక్షాల నుంచి విమర్శలు రావడం, నిరసనలు వెల్లువెత్తడంతో స్వయంగా ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఇది 'పునరుజ్జీవం' అనే క్లారిటీ ఇవ్వా ల్సి వచ్చింది. రాజకీయవేత్తగా ముఖ్యమంత్రికి స్పష్టమైన విజన్ ఉన్నా అధికారులు దానికి సంబంధించిన అనుకూల, ప్రతి కూల అంశాలను వివరించాల్సి ఉంటుందని, సంబంధిత విభాగాలు లేదా అధికారుల ద్వారా ఎగ్జిక్యూట్ చేసేటప్పుడు లీగల్ చిక్కులు సహా ఎమోషనల్ అంశాలకు తావు లేకుండా స్ప ష్టమైన యాక్షన్ ప్లాన్ ను రూపొందించాల్సి ఉంటుంది. సున్నితమైన అంశాలపై ప్రభుక్వం నిర్ణయాలను తీసుకునే ముందు అధికారులతో పాటు సామాజిక వేత్తలకు కూడా ప్రభుత్వ విజన్ ను స్పష్టంగా తెలియజేసి వారి అభిప్రాయాలను తెలుసుకుని ముందుకు వెళ్తే క్షేత్రస్థాయిలో వచ్చే ఇబ్బందులను కొంత మేర అధిగమించేందుకు వీలుంటుంది. ఇలాంటి అంశాలపై ప్రభుత్వం ముందుకు వెళ్ళాలనుకున్నప్పుడు ప్రజల్లో చర్చ కూడా పెడితే బాగుంటుంది. కానీ గతంలో కంటే బిన్నంగా ప్రస్తుత నిర్ణయాలు ఉండటంతో ప్రజల్లో ఎక్కడికక్కడ వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. ఫలితంగా ప్రభుత్వం చేసే 10 మంచి పనుల ముందు ఒక్క పనిని ప్రతిపక్షాలు వివాదాస్పదమైదంటూ ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్ళడంలో సక్సెస్ అవుతున్నాయి. దీంతో ప్రభుత్వ ప్రతిష్టపై మచ్చ పడుతోంది. ముందుగా పాలకులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఒక పనిని చేపట్టే ముందు దాని స్థితిగతులు, వెనకా ముందు వచ్చే పరిణామాలను బేరీజు వేసుకుని ముందుకు వెళ్తే తప్ప రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల వైఖరి నెలకొనడం కష్టసాధ్యం.

**కులగణన చారిత్రాత్మకమే.... అయినా**

చారిత్రాత్మకమైన కులగణన విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాహసోపేతమైన ముందడుగు వేసింది. దీర్ఘకాలంగా అణగారిన వర్గాలు, అధికారాన్ని అందుకోలేనంత దూరంగా ఉన్న ప్రజలు కులగణనను కోరుకున్నారు. ప్రజాభిప్రాయానికి ఎప్పుడూ పెద్ద పీట వేసే సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశంపై ముందుకు వెళ్ళి దేశవ్యాప్తంగా చర్చకు కారకులయ్యారు. అయితే ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ కోసం రూపొందించిన ప్రశ్నావళి మొదలు మొత్తం కార్యాచరణ శాస్త్రీయంగా ఉన్నా ప్రజల సందేహాలను నివృత్తి చేయడానికి నిర్దిష్టమైన మెకానిజాన్ని రూపొందించడంలో లోపం చోటు చేసుకుంది. విపక్షాల విమర్శలు సహా బీసీ సంఘాల ప్రతినిధులు ఆందోళనతో చివరకు సెకండ్ ఫేజ్ నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఇంత చేసినా ప్రభుత్వంపై విమర్శలు మాత్రం ఆగకపోవడం గమనార్హం. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు విషయంలో, రాజీవ్ యువ వికాసం అప్లికేషన్లకు రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధనల విషయంలో ఇలాంటి పొరపాట్లే జరిగాయన్న చర్చ జోరందుకుంది. చివరకు ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సి వచ్చింది. కీలకమైన నిర్ణయాలను తీసుకునే ముందే అభిప్రాయ సేకరణ, సన్నాహక సమావేశాలు నిర్వహిస్తే ఇలాంటి వ్యతిరేకత చోటు చేసుకునేది కాదు. వస్తున్న విమర్శలపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను పటాపంచలు చేయడంలోనూ పాలక పక్ష నేతలు, కార్యకర్తలు విఫలమవుతున్నారు. ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోడానికి ముందే సమగ్రంగా రివ్యూ చేయడం, భాగస్వాములతో చర్చలు జరపడం, ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందులను అంచనా వేయడం, విమర్శలు వస్తే తిప్పికొట్టడానికి తగిన వ్యూహాన్ని రూపొందించుకోవడం ఇలాంటివన్నీ అవసరమన్న విషయాన్ని పాలకులు విస్మరిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షాలు కావాలని రాద్ధాంతానికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే ప్రజల్లో సందేహాల నివత్తి బాధ్యతలను తీసుకోవాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంటుంది. ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులతో చర్చించడం, ప్రభుత్వ నిర్ణయం వెనుక ఉన్న సదుద్దేశం ఏమిటన్నది బహుళ ప్రాచుర్యంలోకి తీసుకు రావడంలో అనుకున్నంత వేగంగా పనులు సాగడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఈ అంశాలన్నింటిపై సచివాలయ కారిడార్లలో విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. గత ప్రభు త్వంలో ఒకే రోజులో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే విషయంలో, ఎగ్జిక్యూషన్ లో ఎలాంటి విమర్శలు రాలేదు. దీనికి కారణం చాలా రోజుల ముందు నుంచే ప్రజలకు అర్థమయ్యే తీరులో ప్రచారం చేయడం, అవగాహన కల్పించడమే.

అధికారుల గైడెన్స్ సరైన తీరులో లేకపోవడం, లోపభూయిష్టంగా ఉండడంతో చివరకు అది ప్రభుత్వానికే మచ్చ తెస్తుంది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే చందంగా ప్రభుత్వం డిఫెన్సులో పడుతుంది. రుణమాఫీ, రైతుభరోసా, సన్నాలకు బోనస్, గ్యారంటీల అమలు, సంక్షేమ పథకాలకు భారీ ఖర్చు ఇలాంటివి ఎన్ని చేసినా ఒకటీ రెండు నిర్ణయాలు వివాదంలో కూరుకుపోవడం, కోర్టుల జోక్యం అనివార్యం కావడంతో వాటిని అమలు చేసే కొద్దిమంది అధికారులూ డీమోరల్ అవుతున్నారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం జాతీయ స్థాయిలో చర్చకు దారితీయడం ప్రభుత్వాన్ని కూడా ఆత్మరక్షణలో పడేసినట్లయింది. ఇటు పార్టీలో, అటు ప్రభుత్వ వర్గాల్లో కంచె గచ్చిబౌలి భూముల వివాదం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో ప్రభుత్వానికి ఇబ్బంది ఏర్పడిందని, న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడంతో కొంతకాలం కోల్డ్ స్టోరేజీలోకి వెళ్లినట్టేనని కాంగ్రెస్ పార్టీలో విస్తృతంగా చర్చ జరుగుతుంది. ఇదే సమయంలో ఇంటెలిజెన్స్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. విద్యార్థుల ఆందోళనను పసిగట్టడంలో నిఘా వర్గాలు విఫలమయ్యాయి. నిరసనలు మొదలు కాగానే వివాదానికి ఫుల్ స్టాప్ పడేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వానికి సూచించడంలో అధికార యంత్రాంగం ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయడంలోనూ విఫలమయ్యారు. జాతీయ స్థాయికి చేరుకునేంత ఎమోషనల్ ఇష్యూగా మారుతుందన్న అంచనాకు కూడా పాలకులు రాలేకపోయారంటే ప్రభుత్వానికి అధికారుల సహాయత ఏ మేరకు ఉందన్నది స్పష్టమవుతోంది. ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమయానుకూలంగా తాజా పరిణామాలు ప్రభుత్వం దృష్టికి వెళ్లి ఉంటే దానికి తగినట్లుగా వ్యూహాత్మక చర్యలు ఉండేవన్న వాదన కూడా ప్రభుత్వ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. విద్యార్థుల్లో ఉన్న అపోహలు, వారి భూముల్ని ప్రభుత్వం లాగేసుకుంటున్నదనే అభ ద్రత సెంటిమెంట్గా మారాయని, అందువల్లనే కాంగ్రెస్ కు అనుబంధంగా ఉన్న ఎన్ఎస్ యూఐ లాంటి సంఘాలు కూడా విద్యార్థులకు మద్దతు ఇవ్వక తప్పలేదనే అభిప్రాయాలు ఆ పార్టీ నుంచి వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ నిర్వహించిన సమావేశంలోనూ ఎన్ఎస్ యూఐ రాష్ట్ర నేతలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీజేపీకి అనుబంధంగా ఉన్న ఏబీవీపీతో పాటు వామపక్ష పార్టీలకు చెందిన విద్యార్థి సంఘాలు సైతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులకు సంఘీభావం తెలిపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఒక వైపు విద్యార్థి సంఘాలు ఐక్యమై పోరాటం చేస్తుంటే అదే సమయంలో ఆ భూములతో వర్సిటీకి సంబంధం లేదని, ప్రభుత్వానికి చెందినదంటూ మంత్రులు బహిరంగంగా ఇచ్చిన వివరణ పరిస్థితిని చల్లార్చడానికి బదులు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. విద్యార్థుల ఆగ్రహం, ఎమోషన్స్ తీవ్రతను గుర్తించి ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయడంలో నిఘా వ్యవస్థ వైఫల్యంపై బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తాయి. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు విరుచుకుపడటం, లాఠీలు ఝుళిపించడం, బలవంతంగా వ్యాన్లలోకి ఎక్కించి పోలీసు స్టేషన్లకు తరలించడం, క్యాంపస్ లో ఎక్కడికక్కడ పోలీసుల మోహరింపు, బయటి వ్యక్తుల్ని లోపలికి ప్రవేశించనీయకుండా బారికేడ్లు పెట్టడం.. ఇలాంటి పరిస్థితితో పరిస్థితి మరింత క్లిష్టమైంది. విద్యార్థుల మాటున బయటి శక్తుల ఎంట్రీ అయ్యాయి. కోర్టులు జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని హెచ్చరించిన తర్వాత నిఘా వ్యవస్థ రంగంలోకి దిగింది. అప్పటికే పరిస్థితి చేయి దాటి పోయింది. విద్యార్థుల మాటున ఎంటర్ అయిన బయట శక్తులపై వివరాలను సేకరించడం మొదలు పెట్టింది. మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో ఫేక్ వీడియోలు, ఫొటోలు సృష్టించి సోషల్ మీడియారో వైరల్ చేసిన శక్తులను గుర్తించడం ప్రారంభించింది. ప్రభుత్వా న్ని విమర్శించడానికి కాచుక్కూర్చున్న విపక్షా లకు గచ్చిబౌలి ల్యాండ్స్ అంశం పొలిటికల్ మైలేజీగా వాడుకోవడంలో సఫలమయ్యాయి. 400 ఎకరాల భూములతో సెంట్రల్ వర్సిటీకి సంబంధం ఉన్నాదా?.. లేదా?.. అనే విషయంలోని వాస్తవాలు ఎలా ఉన్నా పర్యా వరణం, జీవవైవిధ్యం ప్రధానాంశాలుగా మారాయని ఎన్ఎస్ యూఐ కార్యకర్తలు మీనాక్షికి వివరించారు. ఒకేసారి పదుల సంఖ్యలో బుల్డోజర్లు ఆ భూముల్లోకి రావడం.. డ్రోన్ చిత్రాలు గగుర్పాటు కలిగించేలా ఉన్నాయని, అవి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యుద్ధ వాతావరణాన్ని తలపించే సన్నివేశాలు విద్యార్థులకు కలిగాయని తెలపడం చూస్తుంటే లోపాలపై కసరత్తు జరగాల్సిన అవసరాన్ని స్పష్టంగా చెబుతున్నాయి.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# పెంచుడు పంచెం

## అమెరికా, చైనాల మధ్య ముదిరిన వాణిజ్య యుద్ధం

### అమెరికన్ వస్తువులపై 125 శాతం సుంకాలు పెంచిన చైనా



**మహా :** అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతోంది. డొనాల్డ్ ట్రంప్ చైనాని టార్గెట్ చేస్తూ సుంకాలను పెంచారు. మిగతా ప్రపంచ దేశాలకు అమెరికా మూడు నెలలు పాటు టారిఫ్సని నిలిపేసింది. కానీ, చైనాకు మాత్రం అమెరికా ఎలాంటి వెసులుబాటు ఇవ్వలేదు. చైనా ఉత్పత్తుల పై యూఎస్ విపరీతమైన సుంకాలను విధించింది. ఇదిలా ఉంటే, చైనా కూడా అంతే ధీటుగా అమెరికా వస్తువులపై సుంకాలను పెంచుతూ పోతోంది. తాజాగా, యూఎస్ వస్తువులపై సుంకాలను 84 శాతం నుంచి 125 శాతానికి పెంచుతామని చైనా శుక్రవారం తెలిపింది. మరోవైపు, శనివారం నుంచి చైనా ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలు 145 శాతం అమలులోకి వస్తున్నాయి. అమెరికా నిర్ణయానికి ధీటుగా చైనా కూడా స్పందిస్తోంది. దీంతో రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమైంది.

ఇదిలా ఉంటే, అమెరికా టారిఫ్ దెబ్బకు కలిసి పనిచేద్దామని భారత్‌ని చైనా కోరింది. అమెరికా సుంకాలను అడ్డుకోవాలని చెప్పింది. తాజగా, యూరోపియన్ యూనియన్‌కి చైనా కలిసి పనిచేయాలని, అమెరికా నుంచి ఎదురవుతున్న వాణిజ్య యుద్ధం నుంచి బయటపడటానికి సహకరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. చైనా పర్యటనలో ఉన్న స్పానిష్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో జరిగిన సమావేశంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "చైనా మరియు యూరప్ తమ అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాలి, ఏకపక్ష బెదిరింపు పద్ధతులను సంయుక్తంగా నిరోధించాలి" అని చైనా అధ్యక్షుడు చెప్పారు. అంతకుముందు, భారత్ కూడా అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా పోరాడాలని చైనా కోరింది. డ్రాగన్, ఏనుగు కలిసి డ్యాన్స్ చేయాలని జిన్‌పింగ్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముని కోరాడు. చైనా భారత్ ఆర్థిక, వాణిజ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాల ఆధారంగా ఉన్నాయని, ఆమెరికా సుంకాల దుర్వినియోగం చేస్తోందని, ఇది ఇరు దేశాల అభివృద్ధి హక్కును, ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌లో అభివృద్ధి చెందుతున్న పెద్ద దేశాలతో కలిసి నిలబడాలని అని ఇండియాలో చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యూ జింగ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

## సమాజం కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే

### 199వ పూలే జయంతిలో రాష్ట్ర మంత్రివర్యులు కొండా సురేఖ



మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజు, కలెక్టర్లు డాక్టర్ సత్య శారద ప్రావీణ్య..

**హన్మకొండ, మహా:** సమాజంలో అన్ని వర్గాల సమానత్వం కోసం పోరాడిన మహనీయులలో మహాత్మా జ్యోతిబా పూలే ఒకరని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ములుగు రోడ్డు జంక్షన్ లోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కే ఆర్ నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆనాటి సమాజంలోని రుగ్మతలను పారద్రోలడానికి ఉద్యమిస్తూ భవిష్యత్ తరాలకు మార్గం చూపిన మహనీయుల్లో జ్యోతిబాపూలే ఒకరని పేర్కొన్నారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు, విద్యా విషయంలో పూలే దంపతులు చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. సమానత్వం కోసం వారు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మహిళలు విద్యావంతులు కావాలని చెప్పిన మొదటి వ్యక్తి జ్యోతిబా పూలే అని అన్నారు. జ్యోతిబాపూలే సతీమణి అయిన సావిత్రిబాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సేవలను అందించారని, పూలే దంపతులు ఆనాడే బాలికల కోసం విద్యాలయాన్ని స్థాపించి బాలికలు చదువుకోవాలని వారికి అవగాహన కల్పించారని గుర్తు చేశారు. సమాజానికి జ్యోతిబాపూలే అందించిన సేవలను ఆదర్శంగా తీసుకొని అంబేద్కర్ లాంటి వారు ముందుకు సాగారని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, హనుమకొండ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రామ్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అంబలి వితరణ కేంద్రం ప్రారంభం



**కరీంనగర్, మహా:** కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు తణుకు సాయి ఆధ్వర్యంలో కమాన్ కూడలి వద్ద "అంబలి వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇట్టి అంబలి కేంద్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షులు నగునూరి రాజేందర్ జిల్లా అధ్యక్షులు కన్నా కృష్ణ , 48వ డివిజన్ కార్పొరేటర్ దుర్శెట్టి అనూప్ కుమార్ లు హాజరై అంబలి వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ యువజన సంఘం అధ్యక్షులు తనకు సాయి కృష్ణ మాట్లాడుతూ వేసవికాలం ముగిసే వరకు సుమారు ప్రతిరోజు 500 మందికి ఉదయం 9:00 గంటల నుంచి అంబలి వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎండ తాకిడి వల్ల తలెత్తే సమస్యలో కొంతమేర ఉపశమనం కలిగేలా , ఆరోగ్య రీత్యా అంబలి వల్ల చాలా ఉపయోగాలు ఉన్నందున ఈ వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి పట్టణ మహిళా సంఘం రావికంటి భాగ్యలక్ష్మి ,జిల్లా అధ్యక్షురాలు చకిలం స్వప్న ,యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సాయి కృష్ణ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కన్న సాయి, కోశాధికారి సూరజ్ అదనపు ప్రధాన కార్యదర్శి గంప వెంకటేష్, ఉపాధ్యక్షులు ఆకాష్ ,రాహుల్, రాజేష్, కార్యదర్శి సాయి కృష్ణ ,ప్రమోద్ ,యశ్వంత్, సాయి యువజన సంఘం సభ్యులు ,ఆర్యవైశ్య పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప దార్శనీకుడు, సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే

- జ్యోతిరావు పూలే ఆశయాలు కొనసాగించాలి
- జయంతి ఉత్సవాలలో పలువురు వక్తలు



**కరీంనగర్, మహా:** సామాజిక రుగ్మతలను రూపుమాపి బహుజనుల అభివృద్ధికి కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, దార్శనీకుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు శాతవాహన యూనివర్సిటీ చౌరస్తా గల పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు.

మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్ సహా పలువురు బీసీ సంఘాల నేతలు, అధికారులు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే వంటి సంఘసంస్కర్తల కృషివల్లే నేటి సమాజం చైతన్యవంతంగా ఉందని అన్నారు. సమాజ రుగ్మతలను, మూఢాచారాలను అస్పృశ్యతలను రూపుమాపిన జ్యోతి రావు పూలే ఆశయాలు కొనసాగించాలని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కుల గణన చేపట్టిందని, బీసీల రిజర్వేషన్ కోసం చర్యలు తీసుకున్నదని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ ముందు గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద చౌరస్తాను అభివృద్ధి చేస్తామని, ఇందుకు 15 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. నగరంలోని మహాత్మా గాంధీ, జగ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహ కూడళ్లను కూడా అభివృద్ధి పరుస్తామని అన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ బహుజనులకు చదువే అభివృద్ధి మార్గమని సూచించి ఆనాటి రోజుల్లో మహిళా చదువును ప్రోత్సహించిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేసిన రోజుల్లో తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించడంతోపాటు మహిళా పాఠశాలలను స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. భర్త మరణించిన స్త్రీలకు ఆశ్రమాలు ఏర్పాటు చేసి వారు చదువుకునేలా ప్రోత్సహించారని, ఆడపిల్లల భ్రూణ హత్యలను నివారించాలని తెలిపారు. సమాజాభివృద్ధికి ఎంతో కష్టపడిన పూలే త్యాగాలు మరువలేనివని, ఆయన మార్గాన్ని ఆచరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, పలువురు బీసీ సంఘాల నేతలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన

- పోటెత్తిన నిరుద్యోగ యువత, కిక్కిరిసిన ఎం కె నాయుడు హాల్
- మంత్రులు కొండా సురేఖ.. ధనసరి అనసూయ (సీతక్క)
- మెగా జాబ్ మేళాను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన మంత్రులు





**వరంగల్, మహా:** నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు ధనసరి అనసూయ (సీతక్క) అభిప్రాయపడ్డారు. వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధి లోని ఎం కే నాయుడు కన్వెన్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా ను సహచర మంత్రి వర్యులు ధనసరి అనసూయ (సీతక్క) తో కలిసి మంత్రి కొండా సురేఖ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా వివిధ కంపెనీలు జాబ్ మేళాలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను మంత్రులు కొండా సురేఖ, సితక్క, జిల్లాల కలెక్టర్ లు పరిశీలించారు. తొలిత 17 మంది నర్సింగ్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంత్రులు, కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులకు గజమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళాను ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే ఆకాంక్ష తో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను గుర్తించి దశల వారీగా 2లక్షల ఉద్యోగాలను కల్పించాలనే ఉద్దేశంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణకు దేశ విదేశాల నుండి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని తెలంగాణ రైజింగ్ ఇక ఆగదని, ఉద్యోగ కల్పనలో రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలుస్తుందని మంత్రి తెలిపారు. నిరుద్యోగుల బాధలను గుర్తించే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ శాఖలలో 59 వేల ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టడం జరిగింది. ఒకే ఏడాదిలో ఇన్ని ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తెలంగాణలోని ప్రజా ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. నిరుద్యోగుల పక్షాన నిలబడాలనే ఉద్దేశంతో మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ప్రైవేట్ రంగం లోనూ ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా యువత కెరీర్ కు ఎంతో దోహదపడుతుందని అన్నారు. 65 కు పైగా వివిధ మల్టీ నేషనల్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని నైపుణ్యాలను బట్టి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలన్నారు.

### ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**వరంగల్, మహా:** బ్రిటీష్ వలస పాలనలో సామాజిక వివక్ష కు వ్యతిరేకంగా పోరాడి అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలలో విద్యతోనే చైతన్యం సాధ్యమవుతుందని నినదించిన మహాత్మ జ్యోతిరావు పూలే మార్గం అందరికీ స్ఫూర్తి దాయకమని సీకేఎం ప్రభుత్వం ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ధర్మారెడ్డి తెలిపారు. జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం దేశాయిపేటలోని సి.కే ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బడుగు వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని ఆయన దేశానికి అందించిన సేవలు ఎంతో శ్లాఘనీయమని గుర్తు చేశారు. పూలే స్ఫూర్తితో సృజనాత్మకంగా ఆలోచించి ముందుకు సాగాలన్నారు. అనంతరం కళాశాల కెరియర్ అండ్ ప్లేస్మెంట్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు షాడో ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కళాశాల పూర్వ విద్యార్థి షాడో ఆర్ట్స్ స్టార్టప్ ఫౌండర్ సుష్మ, చందన లు విద్యార్థులకు సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎలా అనే అంశంపై తమ సంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్న ఓరియంటేషన్ , వర్క్ షాప్ ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కేఎల్వి వరప్రసాద్ రావు, డాక్టర్ పి. సతీష్ కుమార్, లైబ్రేరియన్ ఎస్ .అనిల్ కుమార్, సూపరిండెంట్ జి .శ్రీనివాస్, గెస్ట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి





**జనగామ,మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూనే మరోపక్క సంక్షేమ పథకాల అమలుచేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్ గడ్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన 68 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 68లక్షల 07వేల 888రూపాయల విలువగల చెక్కులను అలాగే 26మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 07లక్షల 68వేల 500రూపాయల విలువగల చెక్కులను మొత్తం 94మంది లబ్ధిదారులకు 75లక్షల 76వేల 388 రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా వెంటవెంటనే పరిశీలించి త్వరితగతిన దరఖాస్తుదారులకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక సహాయం చేరే విధంగా అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలైన తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. అందులో భాగంగానే సన్నాలు పండించే రైతులను ప్రోత్సహించేందుకు మద్దతు ధరతో పాటు అదనంగా 500 బోనస్ అందిస్తోందని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని, రైతులు తమ పంటను అమ్మిన రెండు మూడు రోజులలో డబ్బులు అందే విధంగా ఎప్పటికప్పుడు ఆన్ లైన్ చేయాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విపరీతమైన ఆర్థిక ఇబ్బందులలో ఉన్నా పేదలకు సంక్షేమ పథకాలు ఆపకూడదనే ఉద్దేశ్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి మీ అందరి ఆశీస్సులు, ఆశీర్వాదలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య రెడ్డి, అధికారులు, మండల నాయకులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బహుజన అనే పదాన్ని సృష్టించిందే మహాత్మా జ్యోతిబా పూలే




**కరీంనగర్, మహా:** సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరీంనగర్ లో స్థానిక తెలంగాణ చౌక్ వద్ద వారి చిత్ర పాఠానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించి వారిని స్మరించుకోవాడం జరిగింది. ఈ సందర్భంగా బిసి కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడటానికి పునాది వేశడాని బహుజనులకు విద్య మరియు సమానత్వం కోసం అదేవిధంగా మహిళల హక్కుల కోసం వారికి అన్నిరకాల ప్రోత్సహించడానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిబా పూలే అని వారు అన్నారు. మహాత్మ తన జీవితంలో ఎప్పుడూ నిమ్న కులాల ప్రజల కోసం తనే స్వయంగా విద్యాలయాలను ప్రారంభించాడు తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి పూణేలో భారతదేశంలోనే మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించాడు. సామాజిక సంస్కరణ అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన మరియు సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడానికి అవిశ్రాంతంగా పనిచేశాడు సమానత్వాన్ని పెంపొందించడానికి అట్టడుగు వర్గాలకు అధికారం ఇవ్వడానికి అతను సత్యశోధక్ సమాజ్ ని అనే సంస్థను స్థాపించాడు. మహాత్మా జ్యోతిబా పూలే జీవితాంతం చేసిన ఆయన జన్మదినోత్సవాన్ని జరుపు కుంటున్నప్పుడు, ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఉజ్వలమైన సమగ్రమైన భవిష్యత్తు కోసం కృషి చేయడం ద్వారా మహాత్మా జ్యోతిబా పూలే వారసత్వాన్ని కోనసాగిద్దాం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి కుల సంఘాల నాయకులు మేకల చంద్రశేఖర్ యాదవ్, వారల శ్రీనివాస్, కలర్ సత్తన్న, కొడూరి పర్శరం గౌడ్, కర్రె పావని, శ్రీలత, జక్కం సంపత్, కల్వ మల్లేష్ యాదవ్, తూల భాస్కర్ రావు సర్వేశం, కర్రె శ్రీనివాస్, పోన్నం అనీల్ గౌడ్ శ్రీనివాస్, జయంత్ తదితరులు పాల్గొన్నారు

## నాంచారమ్మ జాతరకు సహకరించండి

**ములుగు, మహా :** ప్రతీ ఏడాది వైభవంగా నిర్వహించే ఎరుకల నాంచారమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేపట్టేలా చర్యలు తీసుకుని సహకరించాలని ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు ప్రభుత్వ అధికారులను కోరారు. ఈమేరకు శుక్రవారం ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ సంపత్ రావు ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకిని రాజు మాట్లాడుతూ వెంకటాపూర్ మండలం రామాంజాపూర్ శివారులో కాకతీయుల కాలంలో రామప్ప దేవాలయంతో పాటు నిర్మించబడిన పంచకూటాలయాన్ని ఎరుకల నాంచారమ్మ దేవాలయంగా పిలుచుకుంటామన్నారు. 2017నుంచి ఐదు రాష్ట్రాల ఎరుకల కులస్తులను ఏకంచేసి ఇక్కడ జాతర నిర్వహిస్తున్నామని, ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈసారి జాతరకు వచ్చే భక్తులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఆలయ పునర్నిర్మాణం పేరుతో విప్పి కుప్ప పెట్టారని, ప్రభుత్వం స్పందించి ఎరుకల నాంచారమ్మ ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా పనులు చేపట్టాలన్నారు. అంతకుముందు ములుగులోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో జరిగిన సమావేశంలో లోకిని రాజు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో ఐటీడీఏ నుండి ఆదివాసి ఎరుకల కులస్తులకు సహకారం అందక అన్యాయం జరుగుతోందని, ఐటీడీఏలో తమను పట్టించుకునే వారేలేరని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు గురించి సమాచారం ఇవ్వడంలేదని, గిరిజన ఆదివాసి ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో బ్రతుకుతున్న ఎరుకలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజీకయ పరంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఇప్పటికైనా ఎరుకల కులస్తులకు సంక్షేమఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న ములుగు జిల్లా నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఉత్సవ కమిటీ డైరెక్టర్లు కేతిరి బిక్షపతి, పల్లకొండ భాస్కర్, మేడ బంగారయ్య, పాలకుర్తి సురేష్, దేవర్ల పరమేష్, కేతిరి అశోక్, పాలకుర్తి ప్రమీల, కూరాకుల సరోజన, భూపాలపల్లి జిల్లా డైరెక్టర్లు కేతిరి సుభాష్, అంగిడి ప్రశాంత్, దేవరకొండ లక్ష్మణ్, సుల్తాన్ సుధాకర్, దుగ్యాల రామ్, సుల్తాన్ రవి, హనుమకొండ, వరంగల్ జిల్లాల డైరెక్టర్లు మానుపాటి రమేష్, సురేందర్, గణేష్, ఓని సదానందం, దుగ్యాల రామ్, తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పేరిట కాంగ్రెస్ అబద్ధపు ప్రచారం


- ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా సన్నబియ్యం పంపిణీ
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా తూర్పు నియోజక వర్గం 12వ డివిజన్ దేశాయిపేట లోని వినాయక వీధి కేంద్ర ప్రభుత్వం ద్వారా పంపిణీ అయినటువంటి సన్న బియ్యం తో రాగి రజిని రాజు దంపతుల ఇంట్లో గంట రవికుమార్ తోపాటు బీజేపీ నాయకులు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ సన్నబియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉందని, లబ్దిదారులు కూడా సన్నబియ్యం పంపిణీతో ప్రతీ పేదవాడి కుటుంబంలో ఆనందం వ్యక్తం అవుతుందని ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చిందని పెద్దోలు తినే బియ్యం ఇప్పుడు పేదోళ్ల ఇంట్ల ఈ సన్న బియ్యం తింటూ వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా పేదప్రజల కడుపు నింపడానికి 80 శాతానికి పైగా బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ నిరుపేద ప్రజలు లబ్దిపొందుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గడిచిన 5 సంవత్సరాలుగా కరోనా సమయం నుంచి దేశవ్యాప్తంగా ఉచిత బియ్యం పంపిణీకి సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, ఎరుకుల రఘునరెడ్డి, గడల కుమార్, దీందయాల్, జిల్లా కార్యదర్శి గోకె వెంకటేష్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సూరజ్ గౌడ్, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్, నాయకులు బికె రాజు, సతీష్, శ్రీనివాస్, యుగేందర్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలు

- సంఘ సంస్కర్త, కుల వివక్షపై పోరాడిన యోధుడు
- ఆయన చూపిన సన్మార్గంలోనే నేటి యువత నడవాలి



**రంగారెడ్డి జిల్లా, మహా:** రాజేంద్రనగర్ లో ఘనంగా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలు నిర్వహించారు. సంఘ సంస్కర్త, కుల వివక్షపై పోరాడిన యోధుడు, వెనుకబడిన వర్గాల కోసం చేసిన గొప్ప మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే అని ఆయన చూపిన సన్మార్గంలోనే నేటి యువత నడవాల్సిన అవసరం ఉందని నేతలు తెలిపారు. రాజేంద్రనగర్ జూనియర్ కాలేజి వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యేలు సబిత ఇంద్రారెడ్డి, ప్రకాష్ గౌడ్ పాల్గొని మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ మాజీ శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కార్పొరేటర్ లు తోకలా శ్రీనివాస్ రెడ్డి, అర్చన జయప్రకాశ్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ లో ఆపరేషన్ ఛబుత్రా



**ఆదిలాబాద్, మహా :** అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై సంచరించడం, కాలనీల్లో అనవసరంగా తిరగడం, ఓచోట కూర్చుని కబుర్లతో కాలక్షేపం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ఛబుత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో గురువారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలో అర్ధరాత్రి డీఎస్పీ జీవన్ రెడ్డి నేతృత్వంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రోడ్లపై ,కాలనీలో పెద్ద ఎత్తున అకారణంగా సంచరిస్తున్న150 మందిని ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించి అనంతరం తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలిపారు. ఆకస్మిక తనిఖీలలో పదేపదే సంచరిస్తూ పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. అర్ధరాత్రి వేళల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణం కలుగజేయడానికి , యువత ఎలాంటి గొడవలకు దారి తీయకుండా ఉండేందుకు, ప్రమాదాల నివారించేందుకు కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా వివరించారు.ఈ ఆపరేషన్ లో సీఐలు బి సునీల్ కుమార్, కరుణాకర్, ఫణిధర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి,బి శ్రీపాల్, ఎన్ చంద్రశేఖర్, ఎస్ఐలు ముజాహిద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గాన్ని అభివృద్ధి హబ్‌గా తీర్చిదిద్దుతాం

**అనకాపల్లి జిల్లా , పాయకరావుపేట, మహా :** పాయకరావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి హబ్ గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట పంచాయతీ రాజ్ అతిథిగృహం వద్ద అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమీక్షా సమావేశానికి ముందుగా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆమే పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రానున్న పది సంవత్సరాల్లో పాయకరావుపేట నియోజకవర్గం విశాఖ,గాజువాక తరహాలో అభివృద్ధి కానుందన్నారు. అనకాపల్లి జిల్లాలోనే పాయకరావుపేట నియోజకవర్గంలో వనరలు ఎక్కువ అని తెలిపారు.అన్ని రంగాలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో బల్క్ డ్రగ్, స్టీల్ ప్లాంట్ రాబోతున్నాయని చెప్పారు. బల్క్ డ్రగ్ పూర్తి అయితే 11 వేల పెట్టుబడులు రాబోతు న్నాయన్నారు. నిరుద్యోగ యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు వస్తాయని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలు పాలన ఎలా జరిగిందో అందరికి తెలుసన్నారు.గత ప్రభుత్వం కారణంగా పాయకరావుపేట నియోజకవర్గంలో మరలా జీరో నుండి ప్రారంభిచాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.2014 నుండి 2019 వరకు 15 వందల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే గత ఐదు సంవత్సరాల పాటు వై.సి.పి ప్రభుత్వం అభివృద్ధి ని శూన్యం చేశారని ఆరోపించారు. ఆ ప్రభుత్వం లో ఇరిగేషన్ అధ్వానంగా మారిందన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయం

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి**



**కరీంనగర్, మహా:** మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. పూలే జయంతి ని పురస్కరించుకొని శుక్రవారం రోజున కరీంనగర్లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా అధ్యక్షుడు గంగా డి కృష్ణారెడ్డి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా పూలే త్యాగాలను, సమాజానికి సేవలను గంగాడి కృష్ణారెడ్డి గుర్తుచేసుకొని మాట్లాడారు. సామాన్యుడిగా మొదలై, సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. అంటరానితనం , కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని , సమ సమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడు పూలే అని కొనియాడారు. వెనుకబడిన వర్గాలు, దళిత జనార్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ముఖ్యంగా పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని గంగా డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

## హోం మంత్రి మార్నింగ్ వాక్ కి విశేష స్పందన

- మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు
- ఆత్మీయ పలకరింపులతో పరవశించిన వేంపాడు గ్రామం





**అనకాపల్లిజిల్లా , మహా:** నక్కపల్లి మండలం వేంపాడులో నిర్వహించిన మార్నింగ్ వాక్ కి విశేష స్పందన లభించింది. హోంమంత్రి వంగలపూడి అనిత మార్నింగ్ వాక్ చేస్తూ గ్రామస్తులతో ముచ్చటించారు. ఆమె వెంట గ్రామస్తులు అడుగులో అడుగు కలిపారు. అనంతరం వేంపాడులో ఎన్టీఆర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వాకింగ్ చేస్తూనే ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ క్రమంలోనే మంగళ హారతితో హోం మంత్రికి పలువురు మహిళలు స్వాగతం పలికారు. ఉదయం వాకింగ్ చేస్తూ గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకోవడంపై గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేశారు. వేంపాడులో సీసీ రోడ్డు అవసరమని గుర్తించిన ఆమె రామాలయం వీధిలో వెంటనే సీసీ రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు కొన్ని సమస్యలు నాదృష్టికి తీసుకువచ్చారని, త్రాగునీరు, డ్రైనేజీ,రోడ్లు ప్రధాన సమస్యలుగా గుర్తించామని,గ్రామాల్లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తున్నామని, 15 రోజుల్లో త్రాగునీరు సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు.త్వరలో ఇంటింటికి కులాయి ఇవ్వబోతున్నామని మంత్రి అనిత చెప్పారు.

## వక్ఫ్ సవరణ బిల్లును తక్షణమే వెనక్కు తీసుకోవాలి





**ఏలూరు ,మహా :** వక్ఫ్ సవరణ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఏలూరులో ముస్లిం సమైక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు.ఏలూరు పాత బస్టాండ్లోని కర్బలా మైదానంలో ప్రారంభమైన ఈ ర్యాలీ, ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు ఊహించని ఉత్సాహంతో కొనసాగింది. ప్లకార్డులు పట్టుకుని, నినాదాలతో నగరాన్ని మార్మోగించిన వారు బిల్లుపై తమ ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు.వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, ముస్లింల హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

## ఇబ్రహీంపట్నంలో పోషణ పక్షం ఫుడ్ మేళా





**రంగారెడ్డి జిల్లా, మహా:** ఇబ్రహీంపట్నంలో పోషణ పక్షం 2025లో భాగంగా అంగన్వాడి టీచర్లు ఫుడ్ మేళా నిర్వహించారు. ఇబ్రహీంపట్నం సెంటరులో ఆహార వైవిధ్యం చిరు ధాన్యాల ఉపయోగాలు పోషకాహారాలు గురించి సిపిడిఓ వినీతాదేవి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిడిఓ వినీతాదేవి మాట్లాడుతూ... గర్భిణీ మహిళలు రోజువారి ఆహారంలో వైవిధ్యం కల్పించడం వల్ల శరీరానికి కావలసిన పోషకాలు లభిస్తాయని తెలిపారు. రోజు ఆకుకూరలు కూరగాయలు మరియు పండ్లు ఎక్కువ మోతాదులో తీసుకోవాలని, పిల్లలు బయటి జంక్ ఫుడ్స్ తీసుకోకుండా ఉండడం కోసం, ప్రతి తల్లి ఇంట్లోనే ఆరోగ్యకరమైన ఆహారాన్ని చేసి పెట్టాలని అన్నారు. అలాగే వారంలో రెండు సార్లు మనం తినే ఆహారంలో చిరుధాన్యాలు చేర్చుకోవడం ఎంతో లాభదాయకమని తెలిపారు. ఒక మహిళ గర్భం దాల్చిన నుండి బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ పల్లవి, టీచర్లు, పద్మ, పెంటమ్మ, బాలమణి, విజయలక్ష్మి, కవిత, గర్భిణీ మహిళలు, బాలింతలు పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల కోసం యువత పోరాడాలి

**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి**



**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు కోసం యువత పోరాడాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చాలా జాతి రెడ్డి అన్నారు. పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ పరిధి రావి నారాయణరెడ్డి కాలనీ 3 భూ పోరాట కేంద్రంలో సిపిఐ ఆత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమానికి హాజరైన ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ... మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల కోసం యువత పోరాడాలన్నారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన మహిళోద్ధరణ కోసం కృషి చేశాడని కొనియాడారు.

## దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులను ఆపాలి

- ఆపరేషన్ కగార్ ను నిలిపి వేయాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరణ



**కరీంనగర్, మహా:** కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవనం లొ ఆదివాసీలపై దాడులకు వ్యతిరేకంగా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక 20ఏప్రిల్, 2025 నా నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ కరపత్రాన్ని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రోజు బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక కన్వీనర్ లు ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ అడవులలోని కొట్లాది అటవీ, ఖనిజా సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి 1990నుండి 2025వరకు ఆపరేషన్ జన జాగరన్ అభియాన్, సల్వాజూడం,, గ్రీన్ హంట్,ఆపరేషన్ సమాధాన్,ఆపరేషన్ అనకొండ, చివరకు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను అడవులనుండి వెళ్లగొట్టే ప్రయత్నాలు కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని, అందులో బాగాంగానే ఆరు నెలల పసి గుడ్డు మంగ్లీ సోడి మొదలు రేణుక@ మిడ్కో వరకు దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగిస్తున్నదని ఆరోపించారు. దీనికోసం ఆదివాసీలకు అన్ని వర్గాల ప్రజలు,దళితులు,మేధావులు, హక్కుల కార్యకర్తలు అండగా ఉండాలని కోరారు. భూమి, భుక్తి, విముక్తి, ఆత్మగౌరవం కోసం జరిగిన ఇంద్రవెల్లి పోరాటంలో ఆదివాసులపై జరిగిన హత్యకాండను నిరసిస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు, కరీంనగర్ సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి,కొయ్యడ సృజన్ కుమార్,విరసం బాలసానిరాజన్న, సిఎల్ సి బొడ్డుపల్లి రవి,డి హెచ్ పిఎస్ తాళ్ళపల్లి లక్ష్మన్,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడి పల్లి రాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుకసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఐ ఎఫ్ టీ యుజిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.**ఉద్యమాభివందనాలతో** ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ.

## ధన్నూర్ లో జొన్నకొనుగోలు కేంద్రం



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధన్నూర్ లో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో కలిసి బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సొసైటి చైర్మన్ కదం ప్రశాంత్ లు ప్రారంభించారు. ప్రజాపాలనలో ప్రజలకు ఎలాంటి కష్టాలు ఉండవని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతోనే గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని ,దానికి అనుగుణంగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.జొన్న పంట దిగుబడి అధికంగా వస్తుంది కావున ఇంచార్జి మంత్రి సీతక్క తో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో మాట్లాడి ఎకరానికి 15 క్వింటాల్ల వరకు కొనుగోలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## మావోయిస్టులారా లొంగిపోండి

- ప్రభుత్వ పునరావాసం కల్పిస్తాం
- జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్
- ములుగులో 22మంది మావోయిస్టు సభ్యుల లొంగుబాటు



**ములుగు, మహా :** నిషేధిత మావోయిస్టు పార్టీలో కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయక ఆదివాసీ గిరిజనులు బలవుతున్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసం లొంగిపోయిన మావోయిస్టులకు కల్పిస్తామని, వెంటనే అగ్రనేతలతో సహా అందరూ లొంగిపోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ పిలుపునిచ్చారు. పోరుకన్నా ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ 39వ బెటాలియన్ ఆఫీసర్ల సమక్షంలోసీపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన 22మంది సభ్యులు శుక్రవారం ములుగు ఎస్పీ శబరీష్ ఎదుట లొంగిపోయారు. అందులో ముగ్గురు అసిస్టెంట్ కమాండెంట్ లు (ఏసీఎం), ఒకరు పార్టీ సభ్యుడు, 18మంది పూజారీ కాంకేర్ (ఆర్పీసీ) సభ్యులు లొంగిపోయారు. ఈ సంద్భంగా ఎస్పీ అందుకు సంబంధించిన వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం యాకన్నగూడెంకు చెందిన మడవి మాస అసిస్టెంట్ కమాండెంట్ హోదాలో పనిచేస్తున్నాడు. 2010లో మావోయిస్టు పార్టీలో చేరి కమాండర్ ఇడుమా ఆధ్వర్యంలో పలు హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నాడు. 2013లో ఏసీఎంగా పదోన్నతి పొంది 2017లో బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన 12మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించిన అంబుష్ ఘనటలో, బూర్కపాల్ రోడ్డు పనుల రక్షణ కోసం వచ్చిన 25మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించిన ఘనటో, 2021లో టేకుల గుర్మా గ్రామం వద్ద 24మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించిన ఘనట్లో పాల్గొన్నాడు. అదేవిధంగా చతిస్గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మల్లంపేట గ్రామానికి చెందిన ముచ్చకి జోగారామ్ అలియాస్ జోగా పామెడ్ ఏరియా కమిటీలో ఏసీఎం హోదాలో పని చేస్తున్నాడు. 2016లో ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది కోమటిపల్లి ఆర్పీసీ మిలిషియా చీఫ్ గా పనిచేశాడు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఆర్పిఎఫ్ పీఎంజీ పంచమీలాల్, ములుగు డీఎస్పీ రవీందర్, వెంకటాపురం సీఐ బండారు కుమార్, పస్రా సీఐ జి.రవీందర్, వెంకటాపురం ఎస్ఐ తిరుపతి, కన్నాయిగూడెం ఎస్ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిబాపూలే జయంతి



**ఆదిలాబాద్, మహా :** పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే అని కాంగ్రెస్ నాయకులు గిమ్మసంతోష్ ,గుడిపల్లి నగేష్ అన్నారు.జ్యోతి బాపూలే జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మార్గదర్శకాలతో ఆదిలాబాద్ పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు.అంటరానితనం, కుల వివక్షను రూపుమాపటం కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారన్నారు. మహిళలకు విద్యా హక్కుతో పాటు బాల్య వివాహాలను అరికట్టడానికి పూలే తన జీవితాంతం కృషి చేశారని తెలిపారు. పూలే జీవితం ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరం నడవాల్సిన అవసరముందని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామ్ కుమార్ , బూర్ల శంకరయ్య,రాజేశ్వర్ , పోశెట్టి ,శ్రీరాం ,రమేష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**రంగారెడ్డి జిల్లా, మహా:** అమనగల్లు పట్టణం కేంద్రం లోని జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఎన్ఎస్ యుఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ.. బడుగు మైనార్టీ ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, సలీం, అతిఫ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా పై ఉక్కు పాదం

- మూడు టిప్పర్లు, ఒక జెసిబి స్వాధీనం.. అర్ధరాత్రి స్పెషల్ ఆపరేషన్





**ఆదిలాబాద్, మహా :** జిల్లాలో ఎక్కడ ఎలాంటి అక్రమ దందాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకోవాలన్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఆదేశాల మేరకు అదిలాబాద్ డిఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. జైనథ్ మండలం సాంగ్వి పెనుగంగా నది నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అర్ధ రాత్రి దాటిన తర్వాత దాడులు నిర్వహించారు. సాంగ్వి నుండి ఆదిలాబాద్ కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లు ఒక జేసీబీ లను సీజ్ చేసారు. డ్రైవర్లు గంగాధర్,షేక్ మోసిన్, వెంకటేష్,సతీష్, వాహనాల యజమానులు వంగల తిరుపతిరెడ్డి, రాకేష్ రెడ్డి, కొండా లక్ష్మణ్, జ్ఞానేశ్వర్ లతో పాటు సరఫరా చేస్తున్న పెందూరు గణేష్, పెందూర్ మాధవ్, నాగుల నరేష్ లపై కేసులు నమోదు చేసారు.జైనథ్ సిఐ డి. సాయినాథ్, జైనథ్ ఎస్సై వి.పురుషోత్తం సిబ్బంది శివాజీ, నర్సింగ్,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఎన్నం ప్రకాష్



**కరీంనగర్, మహా:** బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో జ్యోతి రావు పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సమావేశానికి యువజన సంఘం అధ్యక్షుడు మదాసు సంజీవ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ మహారాష్ట్ర కు చెందిన సంఘసంస్కర్త, సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిబాపూలే 198వ జయంతి సందర్భంగా ఆ మహనీయున్ని స్మరించుకుంటూ... ఆయన అడుగుజాడల్లో ఆయన ఆలోచన విధానంలో అందరం ముందుకు సాగి సమ సమాజ స్థాపనకై పాటుపడాలని కోరుచున్నాం. భారతీయ సామాజిక సంస్కర్త విద్యావేత్త మరియు కార్యకర్త కుల వివేక్ష కుల వివక్ష మరియు లింగ అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారు. అతను మహిళా విద్యను సమర్థించడం మరియు సామాజిక సమానత్వం కోసం సత్యశోధక్ సమాజం స్థాపించడంలో ప్రసిద్ధి చెందారు. అంటరానితనం రూపుమాపడానికి కృషి చేసిన కృషిచేసిన మహనీయుడు జ్యోతిబాపూలే గారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వరాల జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షులు శానగొండ శ్రీనివాస్, మంతెన కిరణ్, పెంట శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిలు దుంపట మురళి, నల్లవెల్లి రవి, గొడిశేల రమేష్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిదులు కైతోజు బ్రహ్మాచారి, బండారి మల్లయ్య, బిసి మహిళా సంఘం అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుటుంబ ఆదర్శ, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సన్నబియ్యం ఇచ్చేది కేంద్రమే

**ములుగు, మహా :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి ఇచ్చే ఆరు కిలోలల్లో ఐదు కిలోలు ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో ఇస్తోందని, ప్రజా సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉందని పార్టీ గిరిజన మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు స్వరూప అన్నారు. శుక్రవారం బీజేపీ ప్రధాన కార్యదర్శి బైకాని మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మల్లంపల్లి మండల కేంద్రం, శ్రీనగర్ బూత్ లలో చలో గావ్ అభియాన్ చలో బస్తీ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయం, తదితర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గుగులోతు స్వరూప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులలో ఆర్థిక సంఘం నిధులు ఉన్నాయని, ఉపాధి హామీ పథకానికి సంబంధించి డబ్బులు కూడా కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద ప్రతీ మారుమూల గ్రామానికి వచ్చే రోడ్లు కేంద్రం నిధుల ద్వారా వేస్తున్నారని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇండ్లు మంజూరు చేస్తోందన్నారు. పీఎం కిసాన్ యోజన, ఆయుస్మాన్ భారత్, తదితర పథకాలు పేదప్రజలకు వరంగా మారాయన్నారు. బీజేపీ దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తోందననారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బొమ్మరాతి సారన్న, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దండిగ వెంకన్న, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి హరీష్ గౌడ్, ములుగు మండల కార్యదర్శి మచ్చిక రవి, ప్రచార కార్యదర్శి గొట్టేముక్కల నరేష్ శర్మ, కొండ రమ, కందునూరి కార్తీక్, వంశీ, నరేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి



**రంగారెడ్డి జిల్లా, మహా:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు మార్గదర్శకులు మహాత్మా జ్యోతిబా పూలే అని నేటితరం వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మహిళా విద్యకు పెద్ద పీట వేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మహాత్మా జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా సమాజం కోసం పోరాడిన, బహుజన తత్వవేత్త సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని, ఆయన దేశానికి ఎన్నో సేవలు అందించారని, వర్ణ వివక్షను రూపుమాపడం కోసం, దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతి కోసం, జ్యోతి రావు పూలే ఆచరించిన కార్యాచరణ మహోన్నతమైనదని తెలిపారు. కుల, లింగ వివక్షకు తావు లేకుండ విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే జ్యోతిబా పూలే ఆలోచన విధానాన్ని అందరు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఆయన సహచరి సావిత్రి బాయి పూలేకు గురువుగా మారి ఉన్నత విద్యావంతురాలిగా తీర్చిదిద్ది, ఎంతో మంది మహిళలకు సావిత్రి బాయిచే విద్య నేర్పించారని, చరిత్రలో సావిత్రిబాయి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా నిలిచి పోయారని తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను పూర్తి చేసే క్రమంలో ప్రతి ఒక్కరు పునరంకితం కావలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, బిసి సంక్షేమ అధికారి బి. కేశురాం, పిడి మెప్మా మల్లీశ్వరి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, ఈడీ ఎస్.సి కార్పొరేషన్ పద్మావతి, డిపిఆర్ఓ పి.సి.వెంకటేశం, బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్, వడ్డెర సంఘం ప్రతినిధి బోసు రవి, కల్లు గీత కార్మిక సంఘం ప్రతినిధి సుధాకర్ గౌడ్, జిల్లా రజక సంఘం ప్రతినిధి అజయ్, బిసి సంఘం నాయకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

## సామాజిక న్యాయం కోసం పోరాడిన జ్యోతిబా పూలే



**ములుగు, మహా :** రాజకీయ ఉద్యమాలకు భిన్నంగా సామాజిక న్యాయం, సాంఘిక సంస్కరణల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని అదనపు కలెక్టర్ సంపత్ రావు కొనియాడారు. శుక్రవారం ముగులోని సంక్షేమ భవన్ లో పూలే 199వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బ్రిటీష్ వలస పాలన కాలంలో ఉద్భవించిన సాంఘిక దురాచారాలకు చరమగీతం పాడిన గొప్ప వ్యక్తి అన్నారు. పేదల పక్షపాతిగా పేరుతెచ్చుకున్నారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంలో సర్వత్రా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి సీహెచ్.రవీందర్ రెడ్డి, జేఏసీ నాయకులు ముంజాల భిక్షపతి, వడ్డెపల్లి సారంగపాణి, జంపాల రవీందర్, పోరిక రాహుల్, చంటి భద్రయ్య, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు గుల్లగట్టు సంజీవయ్య, వావిలాల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ఏసీబీ దాడులు



**జగిత్యాల, మహా:** జగిత్యాల:జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయంలోని ట్రెజరీ విభాగంలో ఏసీబీ అధికారులు శుక్రవారం చేశారు.ఈ దాడుల్లో రూ.7, 500 లంచం తీసుకుంటూ ట్రెజరీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రఘు కుమార్ బాధితుని నుండి డబ్బులు తీసుకుంటూ పట్టుబడ్డాడు.సిబిఎస్ డబ్బుల కోసం జిల్లా ఖజానా శాఖ సీనియర్ అసిస్టెంట్ రఘుకుమార్ 7000 రూపాయలు డిమాండ్ చేశారని బాధితుడు ఆరోపిస్తున్నారు. అయితే బాధితుని ఖాతాలో డబ్బులు పడడంతో తనకు ఇస్తానన్న ఏడు వేల రూపాయలు ఇవ్వాలంటూ అనేక సార్లు ఫోన్ చేయడంతో బాధితుడు వేసిగిపోయి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ అధికారులు వలపన్ని రఘు కుమార్ ను పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాసేపట్లో ఏసీబీ అధికారులు మీడియా ఎదుట వెల్లడించనున్నారు.

# ఎవరూ తప్పించుకోలేరు.. నేనే రెండుసార్లు ఫైన్ కట్టాను

భారతదేశంలో ట్రాఫిక్ రూల్స్ కఠినంగా మారుతున్నాయి. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన ఎవరికైనా జరిమానా తప్పదు, అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. నేను కూడా ముంబైలో రెండుసార్లు ఫైన్ కట్టానని రైజింగ్ భారత్ సమ్మిట్ 2025 కార్యక్రమంలో వెల్లడించారు. ఇప్పుడు హైవేలమీద అత్యాధునిక కెమెరాలు, సెన్సార్లు ఉన్నాయి. ఎవరూ తప్పించుకోలేదు. మిమ్మల్ని ఎవరూ రక్షించలేరు. కెమెరా ఫోటో తీస్తుంది. జరిమానా తప్పకుండా కట్టాల్సిందే. కఠినమైన ట్రాఫిక్ చలాన్లపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. జరిమానాలు ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రవేశపెట్టలేదు. చట్టానికి కట్టుబడి ఉండటానికి తీసుకొచ్చాము. జరిమానాలు పెరిగాయని ప్రజలు అంటున్నారు.. అలాంటప్పుడు నిబంధనలను ఉల్లంఘించకుండా ఉండే సరిపోతుందని గడ్కరీ అన్నారు. ప్రభుత్వం 2019లో మోటారు వాహన చట్టాన్ని సవరించింది. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం, రవాణా నియమాల ఉల్లంఘనలు పెరగడం వల్ల.. రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కాబట్టి ట్రాఫిక్ ఉల్లంఘనలు తగ్గించడానికి ప్రధాన మార్గం అధిక జరిమానాలు విధించడమే. 2019లో రోడ్డు ప్రమాదం వల్ల మరణించినవారి సంఖ్య సుమారు 1.59 లక్షలు, ఈ సంఖ్య 2022 నాటికి 1.68 లక్షలకు చేరింది. కాబట్టి నియమాలంయు మరింత కఠినతరం చేయకపోతే.. మరణాల సంఖ్య నానాటికి గణనీయంగా పెరిగిపోతుందని గడ్కరీ అన్నారు. గత సంవత్సరం.. ట్రాఫిక్ ఉల్లంఘనలను పర్యవేక్షించడానికి, జరిమానాలు విధించడానికి కృత్రిమ మేధస్సుతో పాటు.. ఇతర సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించాలని గడ్కరీ పేర్కొన్నారు. ఇవన్నీ ఎప్పటికప్పుడు రూల్స్ అతిక్రమించినవారిని గుర్తించడంలో సహాయపడతాయి. తద్వారా దేశంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



## మారిన తత్కాల్ టికెట్ బుకింగ్ రూల్స్
### ఏప్రిల్ 15 నుంచే అమలు


ఇండియన్ రైల్వే తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రక్రియలో కొన్ని కీలకమైన మార్పులు చేసింది.. కొత్త రూల్స్ 2025 ఏప్రిల్ 15 నుంచి అమలులోకి రానున్నాయి. బుకింగ్ టైమ్స్, క్యాన్సిలేషన్ విధానం, చెల్లింపు మొదలైనవన్నీ కొత్త నియమాలలో భాగంగా మారుతాయి. టికెట్ రిజర్వేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా IRCTC ఈ రూల్స్ తీసుకొచ్చింది. తత్కాల్ అనేది ప్రయాణీకులకు.. తక్కువ సమయంలో అత్యవసర ప్రయాణ టిక్కెట్లను అందించడానికి భారతీయ రైల్వే ప్రవేశపెట్టిన ఒక విధానం. ఈ విధానం ద్వారా లక్షలాది మంది ప్రయాణికులు ప్రయోజనం పొందినప్పటికీ.. తత్కాల్ సిస్టం ఏజెంట్ దుర్వినియోగం, సాంకేతిక లోపాలు, డిమాండ్‌సరఫరా అంతరాయాల కారణంగా కొన్ని సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి.

**కొత్త టైమింగ్**

ఏప్రిల్ 15 నుండి తత్కాల్ బుకింగ్ విషయంలో రానున్న మార్పులలో ఒకటి 'సమయం' అనే చెప్పాలి. క్లాస్ ఆధారంగా సమయం మారుతుంది. తత్కాల్ టికెట్స్ కోసం ఒకరోజు ముందుగానే రిజర్వ్ చేసుకోవాల్సి ఉంటుంది. కొత్త టైమింగ్ ప్రకారం ఏసీ క్లాస్ బుకింగ్స్ ఉదయం 11:00 గంటలకు, నాన్ ఏసీ / స్లీపర్ బుకింగ్ మధ్యాహ్నం 12:00 గంటలకు, ప్రీమియం తత్కాల్ బుకింగ్ ఉదయం 10:30 గంటలకు మొదలవుతాయి. రేపు ట్రైన్ జర్నీ చేస్తున్నామంటే.. ఈ రోజే తత్కాల్ టికెట్ బుక్ చేసుకోవాలి. ఈ విషయాన్ని తప్పకుండా గుర్తుంచుకోవాలి. IRCTC వెబ్‌సైట్ & మొబైల్ యాప్‌లో తత్కాల్ టిక్కెట్లను బుక్ చేసుకునే ప్రక్రియను మెరుగైన సామర్థ్యం కోసం అప్‌గ్రేడ్ చేశారు.


## అదృష్టమంటే ఇదే.. ఒకేసారి రెండు లాటరీలు..
# ఊహించనంత డబ్బు!

ఎవరికైనా జీవితంలో ఒకసారి లాటరీ తగిలితేనే వాళ్ళు చాలా అదృష్టవంతులు అని చెబుతారు. అలాంటిది ఒకేసారి రెండు లాటరీలు తగిలితే.. వాళ్ళను ఏమనాలి. ఇలాంటి ఘటన ఎక్కడైనా జరుగుతుందా అని మీరు అనుకోవచ్చు. కానీ అమెరికాలోని నార్త్ కరోలినాలో ఇలాంటి సంఘటన వెలుగులోకి వచ్చింది. దీని గురించి పూర్తి సమాచారం ఇక్కడ తెలుసుకుందాం. నార్త్ కరోలినాలోని ఒక వ్యక్తి అప్పటికే గెలుపొందిన లాటరీ బహుమతి రూ. 40 లక్షలు క్లెయిమ్ చేసుకోవడానికి.. గ్రీన్స్‌బోరో రీజినల్ ఆఫీస్ & క్లెయిమ్ సెంటర్‌కు వచ్చాడు. ఆ సమయంలో తన కుమార్తె.. అతని పుట్టినరోజును గుర్తుగా ఒక కెనో టికెట్ కొనుగోలు చేసింది. లాటరీలో ఆ టికెట్టుకు సుమారు రూ. 86 లక్షలు వచ్చాయి. ఇలా ఒకేరోజు రెండు లాటరీలు తగిలాయి. ఊహకందని డబ్బు చేతికి రావడంతో ఆ వ్యక్తి, అతని కుటుంబం సంతోషంలో మునిగిపోయింది. ఒక అమెరికన్ వ్యక్తి లాటరీలో భారీ మొత్తంలో డబ్బు గెలుచుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఫిబ్రవరిలో కూడా నార్త్ కరోలినాలోని స్టాన్లీకి చెందిన విజేత రాబర్ట్ హోబన్ అనే వ్యక్తి లాటరీ టికెట్ ద్వారా రూ. 95 లక్షల కంటే ఎక్కువ గెలుచుకున్నాడు. ఇతడు లాటరీ టికెట్ కొనుగోలు చేసిన తరువాత, ఆ రాత్రి లాటరీ గెలుచుకున్నట్లు కలగన్నాడు. ఆ కల ఉదయానికి నిజమైంది. కలలో చూసిన మొత్తానికి అతడు గెలుచుకున్నాడు.




# బాబోయ్ బంగారం..
## రెండు రోజుల్లో రూ.4960 పెరిగిన రేటు

దేశంలో బంగారం ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. గురువారం గరిష్టంగా రూ. 2940 పెరిగిన గోల్డ్ రేటు.. ఈ రోజు (ఏప్రిల్ 11) రూ. 2020 పెరిగి ఒక్కసారిగా షాకిచ్చింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా పసిడి ధరలలో మార్పులు జరిగాయి. ఈ కథనంలో ఏ ప్రాంతంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయనే వివరాలను తెలుసుకుందాం. హైదరాబాద్, విజయవాడలలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 87,450 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 95,400 వద్ద నిలిచాయి. నిన్న మాదిరిగానే ఈ రోజు కూడా రూ. 1850 (22 క్యారెట్స్ 10గ్రా), రూ. 2020 (24 క్యారెట్స్ 10గ్రా) పెరిగింది. ఇదే ధరలు గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో కూడా కొనసాగుతాయి. చెన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ. 1850, రూ. 2020 పెరిగింది. దీంతో ఇక్కడ 10గ్రా 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 87,450 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 95,400 వద్ద ఉంది. దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు రూ. 87,600 (10గ్రా 22 క్యారెట్స్), రూ. 95,550 (10గ్రా 24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 1850, రూ. 2020 ఎక్కువ. అంతే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఢిల్లీలో గోల్డ్ రేటు కొంత ఎక్కువగానే ఉంది.



**వెండి ధరలు**

బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు కూడా కొంత పెరుగుదలవైపు అడుగులు వేసాయి. ఈ రోజు (ఏప్రిల్ 10) కేజీ సిల్వర్ రేటు రూ. 1,08,000 చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకే విధంగా ఉన్నప్పటికీ.. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి రేటు రూ. 97,100 వద్ద ఉంది.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## ట్రంప్ పన్నులపై చైనా జిన్‌పింగ్ ఫస్ట్ రియాక్షన్.. ఏమన్నారంటే..




బీజింగ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 145 శాతం సుంకాలను ఏకపక్ష బెదిరింపు అని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అభివర్ణించారు. ట్రంప్ బెదిరింపులను ప్రతిఘటించడానికి యూరోపియన్ యూనియన్ తమతో కలిసి రావాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. అలాగే, అమెరికా ఉత్పత్తులపై సుంకాలను చైనా 125 శాతానికి పెంచినట్టు చెప్పుకొచ్చారు. చైనాపై అమెరికా భారీగా పన్నులను పెంచిన నేపథ్యలో అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పందించారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ..'ట్రంప్ విధించిన 145 శాతం సుంకాలు బెదిరింపులతో కూడినవి. ఏకపక్షంగా అమెరికా నిర్ణయాలు తీసుకుంది. ఇది సమంజసం కాదు. ట్రంప్ పన్నులను ప్రతిఘటించడానికి యూరోపియన్ యూనియన్ మాతో కలిసి రావాలని కోరుతున్నాను. యూరప్ తమ అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాల్సి ఉంది. అందరూ కలిసి ఐకమత్యంగా అమెరికాపై పోరాటం చేయాల్సి ఉంది' అని చెప్పుకొచ్చారు. మరోవైపు.. చైనాపై అమెరికా 145 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో జిన్‌పింగ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడు ఆగ్నేయాసియా దేశాల పర్యటనకు అధ్యక్షుడు జిన్‌పింగ్ బయలుదేరి వెళ్లారు. ఏప్రిల్ 14 నుంచి వియత్నాం, మలేసియా, కంబోడియాలో జిన్‌పింగ్ పర్యటించనున్నారు. ఇక, డొనాల్డ్ ట్రంప్.. వియత్నాం, కంబోడియా దేశాలపై కూడా భారీగానే పన్నులు విధించారు. వియత్నాంపై 46 శాతం, కంబోడియాపై 49 శాతం సుంకాలు విధించారు. ఈ నేపథ్యంలో ఆయా దేశాలతో జిన్‌పింగ్ చర్చలు జరపనున్నారు.

### జిన్‌పింగ్ చాలా స్మార్ట్: ట్రంప్

అంతకుముందు.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జిన్‌పింగ్‌కు ఎప్పుడు ఏం చేయాలో బాగా తెలుసు. దేశం అంటే ఆయనకు ఎంతో ప్రేమ. ఆ విషయం నాకు బాగా తెలుసు. జిన్‌పింగ్ గురించీ తెలుసు. ఆయన సుంకాలపై ఒక ఒప్పందం కుదుర్చుకుంటారని నేను అనుకుంటున్నా. త్వరలోనే దీనిపై చర్చించేందుకు అక్కడి (చైనా) నుంచి మాకు ఫోన్ కాల్ వస్తోందని భావిస్తున్నా. దానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు.

## రాణా అప్పగింతపై స్పందించిన అమెరికా


26/11 ముంబై ఉగ్రదాడుల కీలక సూత్రధారి తహవూర్ హుసేన్ రాణా.. సుమారు దశాబ్దంన్నర తర్వాత విచారణ ఎదుర్కొనబోతున్నాడు. పాక్ మూలాలు ఉన్న లష్కరే ఉగ్రవాది అయిన రాణాను అమెరికా మార్షల్స్ బుధవారం ప్రత్యేక విమానంలో భారత్‌కు తీసుకొచ్చారు. గురువారం సాయంత్రం ఢిల్లీ పాలెం ఎయిర్‌పోర్టులో జాతీయ దర్యాప్తు సంస్థ(NIA) అధికారులకు అప్పగించడంతో అధికారిక ప్రక్రియ ముగిసింది. అయితే ఈ పరిణామంపై అమెరికా స్పందించింది. భారత్‌కు అతన్ని అప్పగించడం గర్వకారణంగా ఉందంటూ ప్రకటించింది. "2008 ముంబై ఉగ్రదాడులకు రూపకర్తగా తహవూర్ రాణా(tahawwur rana)పై అభియోగాలు ఉన్నాయి. ఇందుకుగానూ న్యాయస్థానాల్లో విచారణ ఎదుర్కొనేందుకు అతన్ని అమెరికా నుంచి భారత్‌కు తరలించాం" అని విదేశాంగ ప్రతినిధి టామీ బ్రూస్ మీడియాకు వెల్లడించారు.. ముంబైలో నాడు జరిగిన ఉగ్రదాడి యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి చేసింది. కొంతమందికి గుర్తు లేకపోవచ్చు. కానీ, ఒకసారి పరిశీలిస్తే అది ఎంత భయంకరమైందో.. ఈనాటికి ఎంత ప్రాముఖ్యత సంతరించుకుందో తెలుస్తుంది. ఈ దాడులకు బాధ్యులను చట్టం ముందు నిలబెట్టడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అమెరికా చాలా కాలంగా మద్దతు ఇస్తోంది. ఉగ్రవాదం అనే ప్రపంచ మహమ్మారిని ఎదుర్కొనడానికి భారత్, అమెరికా కలిసి కట్టుగా పని చేస్తుంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు. ఈ విషయంలో ఆయన తన నిబద్ధతను కనబరిచారు. అందుకు మేం గర్వపడుతున్నాం" అని టామీ బ్రూస్ ప్రకటించారు. 2009 అక్టోబర్‌లో ముంబై ఉగ్రదాడులు సహా పలు కేసులు ఉన్న డేవిడ్ కోల్మన్ హెడ్లీని అమెరికాలో అరెస్ట్ చేశారు. హెడ్లీ ఇచ్చిన సమాచారంతో ఇల్లినాయిస్ చికాగోలో ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న తహవూర్ రాణాను అక్టోబర్ 18వ తేదీన ఎఫ్‌బీఐ అరెస్ట్ చేసింది. ఆపై అభియోగాలు రుజువు కావడంతో 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అయితే ముంబై ఉగ్రదాడి కేసులో విచారణ ఎదుర్కొనేందుకు తనను భారత్‌కు అప్పగించకుండా నిలువరించాలంటూ ఇన్నేళ్లపాటు దాదాపు అక్కడి అన్ని కోర్టులను ఆశ్రయిస్తూ వచ్చాడు రాణా. అయితే ఊరట మాత్రం దక్కలేదు. ఈలోపు.. ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించారు. ఆ సమయంలో రాణాను భారత్‌కు అప్పగించే విషయంపై ట్రంప్ స్పష్టమైన ప్రకటన చేశారు. "26/11 ముంబయి ఉగ్ర దాడిలో నిందితుడైన అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిని భారత్ (India)కు అప్పగిస్తాం. అలాగే త్వరలో మరింతమంది నేరగాళ్ల విషయంలోనూ అదే నిర్ణయం తీసుకుంటాం" అని ఆయన ప్రకటించారు. అందుకు తగ్గట్లే పరిణామాలు చకచకా జరిగి రాణాను భారత్‌కు అమెరికా అప్పగించింది. ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 10వ తేదీన భారత్‌లో దిగగానే తహవూర్ రాణాను జాతీయ దర్యాప్తు సంస్థ(NIA) అరెస్ట్ చేసింది. ఆపై కోర్టులో ప్రవేశపెట్టగా 18 రోజుల ఎన్‌ఐఏ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో అతన్ని తీహార్ జైలుకు తరలించారు. 2008 ముంబై ఉగ్రదాడుల కేసుకు సంబంధించి మొత్తం 10 క్రిమినల్ అభియోగాలను రాణా ఎదుర్కోవాల్సి ఉంటుంది.






## గూగుల్ డొమైన్ కొనేసిన ఇండియన్
# తర్వాత ఏం జరిగిందంటే?

2015లో గుజరాత్‌లోని మాండ్వికి చెందిన మాజీ గూగుల్ ఉద్యోగి 'సన్మయ్ వేద్' గూగుల్ డొమైన్ కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉందని గ్రహించి.. కేవలం 12 డాలర్లకు కొనుగోలు చేశారు. ఈ విషయాన్ని అతను సోషల్ మీడియాలో పోస్ట్ చేసారు. 2015 సెప్టెంబర్ 29 తెల్లవారుజామున 1:20 గంటలకు ఒక వింత జరిగింది. నేను Google Domains ఇంటర్‌ఫేస్ గురించి తెలుసుకుంటూ ఉన్న సమయంలో.. గూగుల్.కామ్ అని టైప్ చేసి, సెర్చ్ డొమైన్‌లపై క్లిక్ చేసాను. అప్పుడు గూగుల్.కామ్ కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉన్నట్లు చూసి ఆశ్చర్యపోయాను. నేను డొమైన్ పక్కన ఉన్న యాడ్ టు కార్ట్ ఐకాన్‌ను క్లిక్ చేసాను (డొమైన్ అమ్మకానికి అందుబాటులో లేకపోతే అది కనిపించకూడదు). ఆకుపచ్చ చెక్‌బాక్స్ ద్వారా కనిపించే విధంగా డొమైన్ నా కార్ట్‌కు యాడ్ అయింది. బహుశా లావాదేవీల సమయంలో ఎర్రర్ వస్తుందేమో అనుకున్నాను, కానీ ఎలాంటి సమస్య లేకుండా నా క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు కట్ అయ్యాయి. నేను గూగుల్.కామ్ డొమైన్ కొనుగోలు చేసినట్లు రెండు ఈ మెయిల్స్ కూడా వచ్చాయి. గూగుల్ డొమైన్ కొనుగోలు విజయవంతంగా పూర్తయిన తరువాత.. గూగుల్ డొమైన్స్ నుంచి ఆర్డర్ క్యాన్సిల్ అయినట్లు ఈ మెయిల్ వచ్చింది. నేను ఉపయోగించిన రిజిస్ట్రేషన్ సర్వీస్ గూగుల్‌కు చెందినది కావడంతో.. కంపెనీ దీనిని రద్దు చేయగలిగింది. డొమైన్ క్యాన్సిల్ అయిన తరువాత గూగుల్ కంపెనీ నాకు.. కొంత మొత్తంలో రివార్డును ప్రకటించింది. ఆ డబ్బును ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇండియా ఫౌండేషన్‌కు ఛారిటీకి విరాళంగా ఇవ్వమని చెప్పాను. నా అభ్యర్థన మేరకు వారు సరే అన్నారు. రివార్డు మొత్తాన్ని కూడా రెట్టింపు చేశారు.




## షుజాయా ఇళ్లపై ఇజ్రాయెల్ దాడి

**గాజా:** గాజాపై ఇజ్రాయెల్ మారణకాండను కొనసాగిస్తోంది. నగరంలోని షుజాయాలో బుధవారం ఇళ్లను లక్ష్యంగా చేసుకుని జరిపిన ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడుల్లో 35 మందికి పైగా పాలస్తీనియన్లు మృతి చెందారు. 60 మందికి పైగా గాయపడ్డారు. 80 మంది జాడ తెలియడం లేదు. ఈ దాడుల్లో 10 భవనాలు ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద అనేకమంది చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. క్షిపణుల దాడిలో కొంతమంది శిథిలాల కింద నలిగిపోయారు. భారీ విధ్వంసంతో ఆ ప్రాంతమంతా దుమ్ముతో నిండిపోయింది. ప్రజల ఆర్తనాదాలు, కేకలతో ప్రాంతం మార్మోగింది. గాజా స్ట్రిప్‌లోని ఇతర ప్రాంతాలైన రఫా, ఖాన్‌యూనిస్, డెయిర్ అల్-బలహ్, బెయిట్ హనూన్‌లపైనా ఇజ్రాయెల్ దాడులు చేసింది. బాధితుల్లో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. క్షతగాత్రులు వెల్లువెత్తడంతో ఆస్పత్రులు, వైద్య సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సేఫ్‌జోన్‌గా పరిగణిస్తున్న అల్‌మవాసీని కూడా ఇజ్రాయెల్ వదల్లేదు. అక్కడ దాడులు తాము ఊహించలేదని బాధితులు వాపోతున్నారు. అయితే.. ఒక సీనియర్ హమాస్ నాయకుడిని లక్ష్యంగా దాడి చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం దాడి తెలిపింది. అతని పేరు వెల్లడించలేదు. పౌరులకు హాని కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. గత నెలలో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన నాటి నుంచి గాజాపై ఇజ్రాయెల్ దాడులు పునఃప్రారంభించింది. ఇజ్రాయెల్ సైన్యం దాదాపు 1,500 మంది పాలస్తీనియన్లను చంపింది.



## మెగాఫోన్ పడుతుంటే భయంగా ఉంది

### హృతిక్ రోషన్


బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్న విషయం తెలిసిందే. తాను హీరోగా వచ్చిన బ్లాక్ బస్టర్ క్రిష్ ఫ్రాంచైజీలో భాగంగా నాలుగో పార్ట్‌కు హృతిక్ రోషన్ దర్శకత్వం వహించబోతున్నాడు. అయితే మొదటిసారి మెగాఫోన్ పట్టబోతున్న సందర్భంగా ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు హృతిక్.

దర్శకత్వం అంటే నాకు చిన్ననాటి నుంచి ఆసక్తి ఉంది. కానీ ఇప్పుడు ఆలోచిస్తుంటే భయం వేస్తుంది. మళ్లీ కొత్తగా స్కూల్‌లో అడుగుపెట్టినట్లు అనిపిస్తోంది. ఎందుకంటే ఇది నాకు పూర్తిగా కొత్త రంగం. దర్శకుడిగా ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. ఎంతో పరిశోధన చేయాలి. కొన్నిసార్లు 'ఈ మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నాను?' అని కూడా అనిపించవచ్చు. అయినా, ఈ సవాళ్లన్నింటినీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా దర్శకుడిగా నా ప్రస్థానం మొదలుపెడుతున్నా. మీ అందరి ప్రేమ, సపోర్ట్‌ను ఎప్పటికీ మర్చిపోను! అని హృతిక్ రోషన్ వెల్లడించారు.

హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ హీరో చిత్రం క్రిష్ ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటివరకు హాలీవుడ్ సూపర్ హీరోలు మాత్రమే తెలిసిన ప్రేక్షకులకు ఇండియన్ సూపర్ హీరోగా హృతిక్ రోషన్ అలరించాడు. కోయి మిల్ గయా, క్రిష్, క్రిష్ 3 సినిమాలు రాగా బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇప్పుడు ఇదే ఫ్రాంచైజీ నుంచి క్రిష్ 4 రాబోతుంది. మొదటి మూడు పార్టులకు హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించగా.. తాజాగా వచ్చే క్రిష్ 4తో హృతిక్ మెగాఫోన్ పట్టబోతున్నాడు. ఈ ప్రాజెక్ట్ దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నట్లు సమాచారం.



## తల్లితో కలిసి తండ్రి సినిమా చూసేందుకు వచ్చిన అజిత్ కూతురు.. ఎంత పెద్దదైంది..!



కోలీవుడ్ మాస్ హీరోగా అజిత్ అశేష అభిమానాన్ని సంపాదించుకున్నాడు. కెరీర్‌లో ఎన్నో వైవిధ్యమైన సినిమాలు చేసిన అజిత్ స్టార్ హీరోగా ఓ వెలుగు వెలుగుతున్నాడు. ఆయన తాజాగా గుడ్ బ్యాడ్ అగ్లీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ చిత్రం నెగెటివ్ టాక్‌ని మూటగట్టుకుంది. అయితే అజిత్ క్రేజ్ దృష్ట్యా ఈ మూవీని చూసేందుకు తొలి రోజు చాలా మంది ఆసక్తి చూపారు. ఈ క్రమంలో అజిత్,శాలినిల కూతురు అనౌష్క కూడా తన తండ్రి సినిమా థియేటర్స్‌లో చూసేందుకు వచ్చింది. అజిత్ కుమార్ కుమార్తె అనౌష్క సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండదు. దాంతో ఆమె ఇప్పుడు ఎలా ఉందో తెలుసుకోవాలనే ఉత్సాహం ఉంటుంది. అయితే అజిత్ మూవీ కోసం బయటకు వచ్చిన అనౌష్కని చూసి ఫ్యాన్స్ మురిసిపోయారు. తల్లిదండ్రుల అందాన్ని సొంతం చేసుకొని ఎంత గ్లామరస్‌గా ఉంది అని కొందరు కామెంట్ చేస్తున్నారు. అనౌష్కకి ఇప్పుడు 17 సంవత్సరాలు. ఎరుపు రంగు టాప్, నల్ల ప్యాంటు ధరించి థియేటర్‌కి వచ్చిన అనుష్కని చూశాక అన్ని కెమెరాలు ఆమె వైపే తిరిగాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో అనౌష్కకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. సినిమా ఇండస్ట్రీలోకి వస్తే స్టార్ హీరోయిన్ కావడం గ్యారెంటీ అంటున్నారు. ఇక తల అజిత్ కుమార్ షాలిని దంపతుల ప్రేమకథ గురించి తెలిసిందే. ఈ జంట కలిసి నటించే క్రమంలో ప్రేమలో పడి పెద్దల్ని ఒప్పించి పెళ్లాడారు. షాలిని 2001లో సినిమాను వదిలేసింది. సినిమాల్లోకి వచ్చిన కొద్ది కాలంలోనే మంచి పేరు తెచ్చుకుంది. ఆమె తమిళంలో విజయ్‌తో కాదలుక్కు మరియాధై, అజిత్‌తో అమర కాలం, విజయ్‌తో కన్నుక్కుల్ నిలవు, మాధవన్‌తో సఖీ చిత్రాలు చేసి మంచి పేరు తెచ్చుకుంది.. చివరగా ఆమె ప్రశాంత్‌తో పిరియధ వరమ్ వేండుమ్ చిత్రంలో మెరిసింది. ఆ తర్వాత నటనకు రిటైర్‌మెంట్ ని ప్రకటించింది. హీరో అజిత్‌ను పెళ్లి చేసుకుని సెటిల్ అయిపోయింది.పెళ్లి తర్వాత నటి షాలిని సినిమా వైపు చూడలేదు. పెద్ద డైరెక్టర్లు పిలిచినా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు.. నటి షాలిని మళ్లీ సినిమాల్లోకి వస్తోందనే టాక్ నడుస్తున్నా దీనిపై క్లారిటీ అయితే రావడం లేదు

## ఏది ఇష్టమో చెప్పలేను!



'తరచుగా అడిగే ప్రశ్న' ఇదేనంటూ అగ్ర కథానాయిక దీపికా పడుకోన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేసింది. అందులో తనకు ఎంతో ఇష్టమైన రెండు నగరాలు బెంగళూరు, ముంబయితో ఉన్న అనుబంధం గురించి మాట్లాడింది. బెంగళూరుకు ఎప్పుడు వచ్చినా తన సొంత ఇంటిలా ఫీలవుతానని చెప్పింది. 'నా జీవితంలో ఎక్కువ భాగం బెంగళూరులోనే గడిచింది. చదువంతా అక్కడే సాగింది. స్కూల్, కాలేజీ తాలూకు ఎన్నో జ్ఞాపకాలు ఈ నగరంతో ముడిపడి ఉన్నాయి. ఇక ముంబయి గురించి చెప్పాలంటే..వృత్తిపరంగా నాకు జీవితాన్నిచ్చింది. ముంబయి తాలూకు వైబ్స్ వేరుగా ఉంటాయి. ఈ రెండు నగరాలు నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో, విజయాల్లో కీలక భూమిక పోషించాయి. అందుకే ఏది ఇష్టమో కచ్చితంగా చెప్పలేను' అని దీపికా పడుకోన్ పేర్కొంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

## మే నెలలో సమంత రెండో వివాహం

### గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కుటుంబ సభ్యులు



టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ సమంత. చూడ చక్కని అందం, ఆకట్టుకునే అభినయంతో ఎంతో మంది మనసులని దోచుకుంది సమంత. కొన్నాళ్లపాటు ఈ భామ పర్సనల్ లైఫ్, కెరీర్ సజావుగానే సాగిన ఇటీవల మాత్రం కాస్త ట్రాక్ తప్పింది. నాగ చైతన్యతో విడాకులు, మయోసైటిస్ వ్యాధితో సమంత డిప్రెషన్‌లోకి వెళ్లింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటుంది. నాగ చైతన్యతో విడాకులు తర్వాత సమంత తెలుగు సినిమాలు చేయడం కూడా తగ్గించేశారు. బాలీవుడ్ సినిమాలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నట్టు అర్థమవుతుంది. సమంత హీరోయిన్‌గానే కాకుండా నిర్మాతగా కూడా ప్రయత్నిస్తుంది. సామ్ ఫస్ట్ టైమ్ నిర్మాతగా చేసిన తొలి చిత్రం శుభం టీజర్ ఇటీవల విడుదలై మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. 'త్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరుతో ఆమె సొంత ప్రొడక్షన్ హౌస్ ను స్థాపించి తొలి చిత్రంగా 'శుభం మూవీని ప్రేక్షకుల ముందుకు తెస్తుంది. అయితే గత కొద్ది రోజులుగా సమంత రెండో పెళ్లికి సంబంధించి చాలా వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ దర్శకుడు రాజు నిడుమోరుతో డేటింగ్ చేస్తోన్నట్టు ప్రచారం జరుగుతోంది.వీరిద్దరు చాలాకాలంగా ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి కూడా చేసుకుంటారని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం సమంత, రాజ్‌ల పెళ్లి మేలో ఉంటుందని ఫిలిం నగర్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే ఇరు కుటుంబ సభ్యులు కూడా వీరి పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని , ఇక పెళ్లి జరగడమే తరువాయి అని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజం ఉందో తెలియదు కాని, ప్రస్తుతం ఈ వార్త ఇంటర్నెట్‌లో కూడా తెగ హల్‌చల్ చేస్తుంది. నాగ చైతన్య ఇప్పటికే శోభితని వివాహం చేసుకొని సంతోషంగా వైవాహిక జీవితం గడుపుతుంది. కాని చైతూ నుండి విడిపోయినప్పటి నుండి సమంత సింగిల్‌గానే ఉంటుంది.

## క్రీడా వార్త... WS

## సునీల్ నరైన్ అరుదైన ఫీట్..

### రెండో బౌలర్‌గా రికార్డు




ఐపీఎల్2025లో చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆల్‌రౌండర్ సునీల్ నరైన్ బంతితో మ్యాజిక్ చేశాడు. తన స్పిన్ మయాజాలంతో సీఎస్‌కే బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టాడు. అతడిని ఆడటం ఎవరి తరం కాలేదు. త్రిపాఠి, రవీంద్ర జడేజా, ధోని వంటి కీలక వికెట్లను పడగొట్టి సీఎస్‌కేను దెబ్బతీశాడు. నరైన్ తన నాలుగు ఓవర్లలో కోటాలో కేవలం 13 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు సాధించాడు. ఈ క్రమంలో సునీల్ నరైన్ ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐపీఎల్‌లో సీఎస్‌కే అత్యధిక వికెట్లు పడగొట్టిన రెండో బౌలర్‌గా నరైన్ రికార్డులెక్కాడు. సునీల్ ఇప్పటివరకు చెన్నై జట్టుపై 26 వికెట్లు సాధించాడు. ఇంతకుముందు ఈ రికార్డు భారత మాజీ స్పిన్నర్ హార్భజన్ సింగ్(24) పేరిట ఉండేది. తాజా మ్యాచ్‌తో భజ్జీ రికార్డును సునీల్ బ్రేక్ చేశాడు.ఈ అరుదైన ఫీట్ నమోదు చేసిన జాబితాలో శ్రీలంక దిగ్గజం లసిత్ మలింగ(31) ఉన్నాడు.

**ఐపీఎల్‌లో సీఎస్‌కేపై అత్యధిక వికెట్లు బౌలర్లు వీరే**

31 లసిత్ మలింగ, 26 సునీల్ నరైన్, 24 హర్భజన్ సింగ్, 22 పీయూష్‌చావ్లా

**103 పరుగులకే..**

ఇక ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన సీఎస్‌కే.. కేకేఆర్ బౌలర్ల దాటికి 9 వికెట్లు కోల్పోయి కేవలం 103 పరుగులకే పరిమితమైంది. సీఎస్‌కే బ్యాటర్లలో శివమ్ దూబే(31 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలవగా.. విజయ్ శంకర్(29) కాస్త ఫర్వాలేదన్పించాడు. కేకేఆర్ బౌలర్లలో సునీల్ నరైన్ మూడు వికెట్లు పడగొట్టగా.. హర్షిత్ రానా, వరుణ్ చక్రవర్తి తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు వైభవ్ ఆరోరా, మోయిన్ అలీ తలా వికెట్ సాధించారు.



## చరిత్ర సృష్టించిన ఎంఎస్ ధోని.. ఐపీఎల్ హిస్టరీలోనే



ఎంఎస్ ధోని.. 689 రోజుల తర్వాత తిరిగి కెప్టెన్‌గా మైదానంలో అడుగు పెట్టాడు. ఐపీఎల్2025లో చెపాక్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ధోని వ్యహరిస్తున్నాడు. రెగ్యూలర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఈ ఏడాది సీజన్ నుంచి వైదొలగడంతో ధోని తిరిగి సీఎస్‌కే బాధ్యతలు చేపట్టాడు. ఈ క్రమంలో 43 ఏళ్ల ధోని పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో మొదటి అన్‌క్యాప్డ్ కెప్టెన్‌గా ధోని రికార్డులెక్కాడు. బీసీసీఐ రూల్స్ ప్రకారం.. గత ఐదేళ్లలో అంతర్జాతీయ క్రికెట్ ఆడని ఏ ఆటగాడినైనా అనక్యాప్డ్ ప్లేయర్‌గా పరిగణించవచ్చు. ధోని 2019 వరల్డ్ కప్ సెమీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై తన చివరి ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడాడు. ఈ క్రమంలోనే ధోనిని అన్‌క్యాప్డ్ కోటాలో రూ. 4 కోట్లు వెచ్చించి చెన్నై ఫ్రాంచైజీ రిటైన్ చేసుకుంది. ధోనితో పాటు టీమిండియా వెటరన్ ప్లేయర్లు సందీప్ శర్మ, మోహిత్ శర్మ కూడా రాజస్థాన్ రాయల్స్ (RR), ఢిల్లీ క్యాపిటల్స్ (DC) తరఫున అన్‌క్యాప్డ్ ప్లేయర్స్‌గా ఆడుతున్నారు. అదేవిధంగా ఈ క్యాష్ రిచ్ లీగ్ చరిత్రలో కెప్టెన్‌గా ఎంపికైన అతి పెద్ద వయస్కుడిగా ధోని నిలిచాడు. కాగా ఐపీఎల్ చరిత్రలో కెప్టెన్‌గా ధోని తన పేరును సువర్ణ అక్షరాలతో లిఖించుకున్నాడు. ధోనీ కెప్టెన్సీలోనే చెన్నై సూపర్ కింగ్స్ 2010, 2011, 2018, 2021, 2023లో ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీలను అందుకుంది. అంతేకాకుండా పది సార్లు ఫైనల్స్‌కు కూడా మిస్టర్ కూల్ చేర్చాడు.

## నరైన్ ఆల్‌రౌండ్ షో..

### చెన్నై ఖాతాలో వరుసగా ఐదో ఓటమి

ఐపీఎల్ 18వ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ విజయం సాధించింది. చెపాక్ మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్‌ను చిత్తుగా ఓడించింది. బంతితో చెలరేగిన సునీల్ నరైన్(44, 313) ఆపై సిక్సర్లతో విరుచుకుపడగా.. ఓపెనర్ క్వింటన్ డికాక్(23) ధాటిగా ఆడాడు. కెప్టెన్ అజింక్య రహానే (20నాటౌట్), రింకూ సింగ్(15 నాటౌట్)లు దూకుడుగా ఆడి 8 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించారు. టాపార్డర్ జోరుతో డిఫెండింగ్ ఛాంపియన్ 10.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. ఈ ఎడిషన్‌లో వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ సీఎస్కే గెలుపు తలుపు తట్టలేకపోయింది. ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు 18వ సీజన్ ఏమాత్రం కలిసి రావడం లేదు. బ్యాటింగ్‌లో సమిష్టి వైఫల్యం ఆ జట్టును వెంటాడుతోంది. ఫలితంగా ప్రతి మ్యాచ్‌లో భారీ మూల్యం చెల్లించుకుంటోంది సీఎస్కే. శుక్రవారం చెపాక్‌లో విజయగర్జనతో అభిమానులను అలరించాలనుకున్న ధోనీ బృందానికి మళ్లీ నిరాశే మిగిలింది. 104 పరుగులస్వల్ప లక్ష్యాన్ని కోల్‌కతా ఆడుతూపాడుతూ ఛేదించింది. ఓపెనర్లు క్వింటన్ డికాక్(23),సునీల్ నరైన్(44:18 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లు)లు తొలి వికెట్‌కు 41 రన్స్ జోడించి శుభారంభం ఇచ్చారు. అయితే.. అన్షుల్ కంబోజ్, నూర్ అహ్మద్‌లు ఈ ఇద్దరినీ బౌల్డ్ చేసి బ్రేకిచ్చారు. ఆ తర్వాత అజింక్యా రహానే(20 నాటౌట్) రింకూ సింగ్(15 నాటౌట్)నింపాదిగా ఆడి జట్టును గెలిపించారు. జడేజా వేసిన 11వ ఓవర్ తొలి బంతిని రింకూ సిక్సర్‌గా మలవగా 8 వికెట్లతో కోల్‌కతా విజయం సాధించింది. భారీ విక్టరీతో కోల్‌కతా రెండు పాయింట్లతో పాటు మెరుగైన రన్‌రేటు సొంతం చేసుకోనుంది.

### దూబే పోరాటంతో..

కీలక మ్యాచ్‌లోనూ చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు సమిష్టిగా విఫలమయ్యారు. తమ సొంత మైదానమైన చెపాక్‌లో దంచలేక చేతులెత్తేశారు. మొదట బ్యాటింగ్ అవకాశం వచ్చినా భారీ లక్ష్యాన్ని నిర్దేశించ లేకపోయారు. టర్నింగ్ పిచ్ మీద కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్ అస్త్రం సునీల్ నరైన్(3-13) విజృంభణతో సీఎస్కే ఆటగాళ్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. విజయ్ శంకర్(29), రాహుల్ త్రిపాఠి(16).. లు కాసేపే నిలబడ్డారంతే. శంకర్, దీపక్ హుడా(0)లను వరుణ్ చక్రవర్తి ఔట్ చేయగా.. అశ్విన్(1)ను హర్షిత్ రానా పెవిలియన్ పంపాడు. జడేజా(0)ను , ఎంఎస్ ధోనీ(1)ని ఎల్బీగా ఔట్ చేసి సీఎస్కే భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు నరైన్.సిక్సర్ల శివం దూబే (31 నాటౌట్) తనదైన శైలిలో సైతం బౌండరీలు కొట్టలేకపోయాడు. డెత్ ఓవర్లలో మూడు బౌండరీలతో 100 దాటించి.. జట్టుకు గౌరవ ప్రదమైన స్కోర్ అందించాడు. ఈ ఎడిషన్‌లో ఇదే అత్యల్ప స్కోర్ కావడం విశేషం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## సమన్వయంతో సరస్వతీ పుష్కరాలు నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్లో ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్
- ప్రత్యేక యాప్ ద్వారా భక్తుల కు సమాచారం
- ప్రతిరోజు హారతి, సంగీత కార్యక్రమాలు



**కాటారం , మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా త్రివేణి సంగమం కాళేశ్వరం శైవక్షేత్రం లో జరిగే సరస్వతి నది పుష్కరాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నారు. శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, పర్యాటక శాఖ ఎండి ప్రకాష్‌రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పుష్కరాల సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, సరస్వతి పుష్కరాల ప్రాధాన్యతను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భక్తులకు సమాచారం అందించేందుకు ప్రత్యేక యాప్ రూపకల్పన జరుగుతోందని తెలిపారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పుష్కరాల 12 రోజుల కార్యక్రమాల షెడ్యూల్‌ను ముందుగా రూపొందించి, ప్రతి రోజు జరిగే కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. టెంట్ సిటీ ఏర్పాటుకు సంబంధించి పర్యాటక శాఖ ఎండి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి రోజు జరిగే హారతి, సంగీత కార్యక్రమాలకు ప్రత్యేక ఇంచార్జ్‌లు నియమించాలని సూచించారు. ట్రాఫిక్ సునాయాసంగా కొనసాగేందుకు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆధ్యాత్మిక పుస్తకాలప్రదర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిపిఓ నారాయణ రావు, ఇరిగేషన్ ఈ ఈ తిరుపతి రావు, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, విద్యుత్తు శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, దేవస్థానం ఈఓ మహేష్, మత్స్యశాఖ అధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అక్షరాభ్యాసం... శ్రీమంతం

**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని అంకుసాపూర్ అంగన్వాడీ కేంద్రంలో అన్ని రకాల కార్యక్రమాలు నిర్వహించారు సూపర్వైజర్ శివ రాణి మాట్లాడుతూ తల్లులకు చిరుధాన్యాలు గురించి తయారుచేసిన ఆహార పదార్థాల ప్రాముఖ్యత, పోషకాహార లోపం లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని తల్లులకు వివరించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం గర్భిణి మహిళలకు, సీమంతం, అల్లీపూర్ అంగన్వాడి కేంద్రంలో చిరుధాన్యాల ఆవశ్యకత వాటిలో ఉండే పోషక పదార్థాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు చేతులు కడుక్కోవడం పరిశుభ్రత విషయాలపై బోధించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శివ రాణి అంగన్వాడి టీచర్లు ముసుకుల శ్రీలత రెడ్డి, షహేదా బేగం, శ్రీలత, ఆశాలు రెహమత్, సర్దార్ బి చిన్నారులు తల్లులు, గర్భిణీ మహిళలు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలు.. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మహా:** మహాత్మా జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని, జ్యోతి ప్రజ్వలన గావించి, మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక ఉద్యమకారుడిగా, కుల వివక్షతకు వ్యతిరేకంగా అన్ని వర్గాల సమానత్వానికి పాటుపడిన మహాత్మా జ్యోతిబా పూలే సేవలు నేటి సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. సమానత్వం లేని కాలంలో సత్య శోధక్ సమాజ్ ను ఏర్పాటు చేసి సమానత్వానికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా, సంఘ సంస్కర్తగా సేవలందించారని, ఆయన చేసిన కృషి ఫలితంగానే సమాజంలో నేడు మార్పులు వచ్చాయని, ఆనాటి పరిస్థితులు, నేటి పరిస్థితులు వేరైనప్పటికీ, మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే చదువు ప్రాముఖ్యతను విస్తరింపజేశారని, ప్రత్యేకించి మహిళల విద్యకు కృషి చేశారని, సతీసహగమనం, వర్ణ వ్యవస్థ నిర్మూలనకు తన జీవితాన్ని త్యాగం చేశారని వెల్లడించారు. అంతకుముందు సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందాలచే మహాత్మా జ్యోతిబా పూలే గొప్పతనాన్ని పాటల ద్వారా ఆహుతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రవీందర్, డీఎస్సీడీఓ విక్రమ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కల్లు గీత కార్మిక సంఘం ఉపాధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బార్నె వెంకట మల్లయ్య, జిల్లా పద్మశాలి సంఘ అధ్యక్షులు వేముల బాలరాజ్, విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు నారోజు రామేశ్వర చారి, కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జామ మల్లేష్, కురుమ సంఘ అధ్యక్షులు బాల్దే మల్లేశం, వడ్డెర సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి దుర్గయ్య, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు శివరాత్రి కుమార్, సంచార జాతుల జిల్లా అధ్యక్షులు కడారి రమేష్, కురుమ సంఘ పట్టణ కార్యదర్శి జూకంటి శ్రీశైలం, రజక సంఘ నాయకులు మామిడల రాజు, కురుమ సంఘ నాయకులు మంగ రామకృష్ణ, సీనియర్ పాత్రికేయులు కన్నా పరశురాములు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





**కాటారం , మహా :** భూపాలపల్లి జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయం నుండి ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండింగ్, ఉపాధిహామీ పథకం పనులకు లేబర్ మొబలైజేషన్, అమ్మ ఆదర్శ పాఠశాలల బిల్లులు చెల్లింపు, వృద్ధాప్య పింఛన్లు, రాజీవ్ యువ వికాసం తదితర అంశాలపై గృహనిర్మాణ శాఖ, డీఆర్డీఓ, డీఈఓ, మున్సిపల్ కమిషనర్ ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపిడిఓలను ఆదేశించారు. కాటారం డివిజన్ లో లబ్ధిదారుల విచారణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపికైన లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధిహామీ పథకం లో కూలీల సంఖ్య పెంచాలి గ్రామాలలో ఈ పథకంలో పనులకు పెద్దఎత్తున లేబర్ ను మొబలైజ్ చేయాలని తెలిపారు. మన జిల్లాలో ఉపాధిహామీ పథకం పనుల్లో ఆశించిన ప్రగతి రావడం లేదని అన్నారు. మన జిల్లాలో కూలిరేటు సరాసరి 211 రూపాయలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి వారం ప్రగతి రావాలని సూచించారు. ఉపాధిహామీ పథకం పనులు వినియోగానికి ఈ రెండు నెలలు చాలా కీలకమని తెలిపారు. ఎక్కువ మందికి పనులు కల్పించడం ద్వారా నిధులు మంజూరుకు అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

**రాజీవ్ యువ వికాసం**

గురించి మాట్లాడుతూ దరఖాస్తు చేయడానికి 3 రోజులు సమయం మాత్రమే ఉన్నందున పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తగు ఏర్పాట్లు తో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఆఫ్ లైన్ లో వచ్చిన దరఖాస్తులు ఎప్పటి కపుడు ఆయా కులాలు వారిగా రిజిస్టర్ లో నమోదులు చేయడంతో పాటు ఆన్లైన్ చేయాలని, రశీదు ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపల్, ఎంపిడిఓ కార్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని సూచించారు. దరఖాస్తు దారుడికి రశీదు ఇవ్వాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు నమోదును పరిశీలన చేయాలని సూచించారు.

**సెర్ప్ శాఖ కార్యక్రమాలు**

గురించి ప్రస్తావిస్తూ వృద్ధాప్య. పింఛను తీసుకుంటున్న వ్యక్తి మరణిస్తే అతని/ఆమె భార్యా లేదా భర్తకు పింఛను మంజూరుకు విచారణ నిర్వహించాలని తెలిపారు. వలస వెళ్లిన పింఛను దారులు, మూడు నెలల పాటు పింఛను తీసుకోని వారి జాబితా సేకరణ చేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో* చేపట్టిన పనులకు నిధులు చెల్లింపు చేసేందుకు సోమవారం వరకు బిల్లులు అందచేయాలని పీఆర్, గిరిజన, టీడబ్ల్యూ ఐడిసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పేమెంట్ చేయడంలో జాప్యం జరుగుతోంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిఆర్డీఓ నరేష్, డిపిఓ నారాయణ రావు, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, డీఈఓ రాజేందర్, బిసి, ఎస్సి సంక్షేమ అధికారులు శైలజ, సునీత, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అన్ని మండలాల ప్రత్యేక అధికారు లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురవుతున్న ఇందిరమ్మ సాగర్, వేములకత్వను కాపాడాలి

- రంగారెడ్డి జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య
- కబ్జాకు గురవుతున్న చెరువులు,కాల్వలను పరిశీలించిన సీపీఐ నేతలు



**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** సిటీ శివారులో ఉన్న చెరువులను అధికారులు రక్షించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కబ్జాకు గురవుతున్న చెరువు,కాల్వలను కాపాడి హద్దులు నాటాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య, సీనియర్ నాయకులు ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు.కబ్జాకు గురవుతున్న రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం అనాజ్ పూర్ గ్రామంలో ఉన్న వేముల కత్వ, ఇంద్రమ్మ సాగర్ లను శుక్రవారం జిల్లా నాయకులు పరిశీలించారు. రెండు చెరువులలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఎఫ్టిఎల్ బఫ్ఫర్ జోన్లలో భారీగా రోడ్లు వేస్తున్నట్లు గుర్తించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులు, కత్వలను,కబ్జా దార్ల నుండి రక్షించడంలో రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారని అన్నారు. జీనియస్ డెవలప్మెంట్ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు 300 ఎకరాల భూమిని చదును చేస్తూ అందులో విలాస్ నిర్మించాలని చూస్తున్నారని ఈ డెవలప్మెంట్ పనులకి నాలా కన్వెన్షన్ గాని, హెచ్ఎండిఏ పర్మిషన్ గాని, మైనింగ్, ఇరిగేషన్ అధికారుల నుండి ఎటువంటి పర్మిషన్ లేకుండా పెద్ద పెద్ద గుట్టల్ని బ్లాస్టింగ్ చేస్తూ , గ్రామస్తులకు పెద్ద పెద్ద ధ్వనులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఆ గ్రామానికి జీవన ఆధారమైన ఇందిరామ్మసాగర్, పైన ఉన్న వేముల కత్వాను ఇప్పటికే ఒకపక్క ఫిలిం సిటీ యాజమాన్యం ఎఫ్టిఎల్ నుండి భారీ భారీ గోడ నిర్మించిందన్నారు. ఇప్పుడు చదును చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఎఫ్ టి ఎల్, బఫ్ఫర్ జోన్లో గుట్టలను పగలదీసి పెద్ద పెద్ద రాళ్లతో చెరువులో పోసి నిబంధనలకు వ్యతిరేకంగా భారీ రోడ్డు వేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు ఇరిగేషన్ అధికారులు తెలిసి కూడా ఏమి చేయకుండా మామూళ్లకు ఆశపడి చెరువుకుంటలని కబ్జా చేస్తున్నారన్నారు.ఇలా విచ్చలవిడిగా కబ్జాలు చేస్తున్నారని వారిపై మౌనంగా ఉంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఎంత దూరం వెళ్లాడానికైనా తాము సిద్ధమన్నారు. లేనిచో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఎంతటి పెద్దవారైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా నాయకులు ముత్యాలు, కావలి జంగయ్య, గుండె శివకుమార్ ,మహేశ్వరం లింగస్వామి, పి శ్రీనివాస్, గ్రామ రైతులు వెంకటేష్, మహేష్, బాలాజీ, ఐలయ్య పాల్గొన్నారు.



## కోల్డ్ స్టోరేజ్ యజమానులతో ఏఎంసీ చైర్మన్ సమావేశం

**మధిర ఏప్రిల్ 11 మహా :** మార్కెట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు అధ్యక్షతన మార్కెట్ పరిధిలో ఉన్న అన్ని కోల్డ్ స్టోరేజ్ యజమానులు, ట్రేడర్స్ సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనుమతితో మధిర మార్కెట్ యార్డ్ ను రెగ్యులర్ చేయుట గురుంచి ఈ సందర్భంగా వారు చర్చించారు. అంతే కాక ట్రేడర్లు అందరు తప్పని సరిగా ట్రెడ్ లైసెన్స్ తీసుకోవాలని కోరారు. రెగ్యులర్ మార్కెట్ చేయుట వలన ఈ ప్రాంతంలో ఉన్నటువంటి రైతులకు న్యాయం జరుగుతుందని ఏ ఒక్క రైతు పండించిన పంట ఇబ్బంది పడకుండా అమ్ముకొనుటకు అవకాశం ఉందని చెప్పారు. అనంతరం కోల్డ్ స్టోరేజ్ యజమానులు, ట్రేడర్స్ కలిసి చైర్మన్ బండారు నరసింహారావు మరియు వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి లను శాలువా కప్పి పుష్ప గుచ్చంతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ చంద్రశేఖర్ సూపర్వైజర్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## మెగా జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్

- 5,631 మందికి వెంటనే నియామక పత్రాలు అందజేత
- కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కొండా సురేఖ




**వరంగల్, మహా:** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఎంకే నాయుడు కన్వెన్షన్ హాల్లో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ జాబ్ మేళాకు ఊహించదానికంటే భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరైయ్యారు. ఈ జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నియామక పత్రాలను అటవీ,పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అందజేయడం జరిగింది. నిరుద్యోగ సమస్యను పారద్రోలడానికి ఇలాంటి జాబ్ మేళాలు ఎంతో గాను ఉపయోగపడతాయని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది నిరుద్యోగుల కళ్ళల్లో ఆనంద భాష్పాలు కనిపించాయి. ఈ యొక్క జాబ్ మేళా కార్యక్రమంలో నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేసి జాబ్ మేళా ను సక్సెస్ చేయడం జరిగింది. కాగా ఈ జాబ్ మేళాలో మొత్తం 23,238 మంది నిరుద్యోగ యువత హాజరు కాగా 5,631 మందికి ఉద్యోగాలు లభించాయి. 9046 మంది ఉద్యోగ అభ్యర్థికి ఫైనల్ రౌండ్ కి షార్ట్ లిస్టు అయ్యారు. వీరికి మరొక పరీక్ష నిర్వహించి సెలెక్ట్ చేస్తారని ఆయా కంపెనీల నిర్వాహకులు తెలిపారు. అయితే, ఇంత సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరు అయి... సంపూర్ణంగా వినియోగించుకోవడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## పెట్రోల్ బంకు నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి సూచన**




**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** నాణ్యత ప్రమాణాలతో కూడుకున్న పెట్రోల్ డీజిల్ వినియోగదారులకు అందించే విధంగా పెట్రోల్ బంకు నిర్వాహకులు ముందుకు వెళ్లాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండల మండల కేంద్రంలో జెఎంఆర్ నూతన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వినియోదారులకు పెట్రోల్ బంక్ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలతో కూడిన పెట్రోల్, డీజిల్ విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇన్ చార్జీ క్యామ మల్లేష్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య గౌడ్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, జేఎంఆర్ పెట్రోల్ బంక్ నిర్వాహకులు జెక్కిడి రఘు రఘువీర్ రెడ్డి, ఎల్బీనగర్ బీ ఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించు శ్రీ వీర హనుమాన్ విజయ యాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు



**కరీంనగర్, మహా:** చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12వ తేదీ శనివారంనాడు కరీంనగర్ లో నిర్వహించనున్న శ్రీ వీరహనుమాన్ విజయ యాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు ఏర్పాట్లు చేయనున్నట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్, టౌన్ ఏసీపీ కార్యాలయంలో గురువారంనాడు డివిజన్ లోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ యాత్ర కరీంనగర్లోని వైశ్య భవన్ ప్రక్కన గల రామాలయం నుండి ప్రారంభమై రాజీవ్ చౌక్ , టవర్ సర్కిల్ , గంజ్ రోడ్ , రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా , కమాన్ రోడ్ మీదుగా , బస్టాండ్ , తెలంగాణ చౌక్ , ఐబీ చౌరస్తా , కోర్ట్ చౌరస్తా , మంచిర్యాల చౌరస్తా , గాంధీ స్టాట్యు తిరిగి రామాలయం వద్ద ముగుస్తుందని తెలిపారు. దాదాపు ఆరు కిలో మీటర్ల మేర నిర్వహించు ఈ యాత్రకు 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీసు కమీషనర్ తెలిపారు. బందోబస్తులో భాగంగా స్టాటిక్ ఫోర్స్ , స్ట్రైకింగ్ ఫోర్స్ , మొబైల్ పెట్రోలింగ్ , అవసరమైన చోట రూఫ్ టాప్ లతో పాటు సున్నితమైన ప్రాంతాల్లో పికెట్ లు కూడా ఏర్పాటు చేస్తున్నామని కమీషనర్ తెలిపారు. ఈ యాత్రలో సీసీ కెమెరా ల పర్యవేక్షణతో పాటు పోలీసు డ్రోన్ లను వాడనున్నామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ రద్దీ వుండే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు దారి మళ్లింపు చర్యలు చేపడుతున్నారని ఆయన తెలిపారు. యాత్ర నిర్వహించు మార్గం అంతా పోలీసు కమీషనర్ గురువారంనాడు ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమీషనర్ తో పాటు అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీ లు వెంకటస్వామి టౌన్ , యాదగిరిస్వామి ట్రాఫిక్ , టౌన్ ఇన్స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్ , సృజన్ రెడ్డి , జాన్ రెడ్డి , ఖరీముల్లాఖాన్ లతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 28 కోట్ల నిధులతో పాలిటెక్నిక్ నూతన భవనం

- భూమి పూజ నిర్వహించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని
- పాల్గొన్న ఎంపీ,కుడా చైర్మన్, కలెక్టర్,ఎమ్మెల్యే






**వరంగల్, మహా:** 28 కోట్ల నిధులతో పాలిటెక్నిక్ నూతన భవనానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. నూతన పాలిటెక్నిక్ భవనానికి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం 28 కోట్లు నిధులు మంజూరి చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎం.పి. కడియం కావ్య, వర్ధన్నపేట ఎం.ఎల్.ఏ. కే.ఆర్. నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్ తో కలిసి భూమి పూజ చేసారు.

**ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..**

భారత దేశంలో సాంకేతిక విద్యాభివృద్ధికి పునాదులు వేసింది భారతీయ జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హయంలో 1955 వ సంవత్సరంలో వరంగల్ పట్టణ నడిబోడ్డులో ఏర్పాటు చేయబడిన సాంకేతిక విద్యాలయం వరంగల్ పాలిటెక్నిక్ కాలేజి నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో సాంకేతిక విద్యా శాఖా మంత్రిగా ఉన్న జిల్లాకు చెందిన హయగ్రీవ చారి కూడా ఈ కళాశాలను ఎంతో అభివృద్ధి చేసారు. జూనియర్ టెక్నికల్ ల్కోల్ (జేటిఏం) స్థాయి నుండి డిప్లొమా పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ విద్యనూ అందించే స్థాయికి ఎదిగిన వరంగల్ పాలిటెక్నిక్ లో విద్యనూ అభ్యసించిన వారు అంతర్జాతీయంగా, దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా అత్యున్నత శిఖరాలను అధిరోహించి, ఉన్నత స్థానాలలో స్థిరపడి ఉన్నారు. నేటికి 70 సంవత్సరాల సుధీర్ఘ చరిత్ర కలిగిన వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 2014 తెలంగాణా ఆవిర్భావం నాటికి అత్యంత శిథిలావస్థకు చేరుకొని ప్రమాదః భరితంగా మారింది. ఆ సందర్భంలో ఆ నాటి విద్యార్ధి నాయకులు, విద్యార్థులు సంభందిత సాంకేతిక విద్యాశాఖా ఉన్నతాదికారుల దృష్టికి , వరంగల్ జిల్లా యంత్రాంగం దృష్టికి, ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అనేక సార్లు సమస్యను తెలియ చేసిన ఏం పట్టించుకోలేదు. ఆనాటి విద్యార్ధి నాయకుడు మేకల అక్షయ్ కుమార్ నేతృత్వంలో విద్యార్థులు అనేక మార్లు ధర్నాలు నిరాహార దీక్షలు, తరగతుల బహిష్కరించిన కూడా ఆనాటి ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం పట్టించుకోలేదని నిధులు కూడా మంజూరు చేయలేదని శాసన సభ్యునిగా నేను ఎన్నికయ్యాక కళాశాల పూర్వ విద్యార్థులు ప్రిన్సిపాల్ మా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులూ ఈ..వి. శ్రీనివాస్ రావు ఆధ్యవర్యంలో విద్యార్ధి నాయకులు వచ్చి కలవడంతో పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనానికి నిధులు కావాలని లేఖ రాయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్, డాక్టర్ రామ్ ప్రసాద్, కళాశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ.వి. శ్రీనివాస్ రావు, మేకల అక్షయ్ కుమార్, శ్రీ విద్య, కుమ్మరి వేణు. బానోత్ వెంకన్న, రవితేజ, కుమార్, దయాకర్, శ్రీలేఖ, కళాశాల గత ప్రిన్సిపాల్ రామనారాయణ, వెంకట నారాయణ, బోధనా సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులూ వేముల శ్రీనివాస్ బంక సరళ, రహీమున్నిసా బేగం, అంబేద్కర్ రాజు తాళ్ళపల్లి మేరి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలలో పౌష్టికాహారం ప్రదర్శన

**కారేపల్లి, మహా :** పౌష్టికాహారంతోనే పిల్లల శారీరక, మానసిక వికాసం కల్గుతుందని ఐసీడీఎస్ కామేపల్లి ప్రాజెక్టు సూపర్‌వైజర్లు గీతాబాయి, రాధ, ఎం.రమణ, మాలతికుమారిలు అన్నారు. పోషణ్ అభియాన్ పక్షోత్సవాలలో భాగంగా గాదెపాడు, గిద్దవారిగూడెం ఈట్యాతండా లోగల అంగన్‌వాడీ కేంద్రాలలో లబ్ధిదారులకు పోషకాహారం, 1000 రోజుల ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఇంటిలో లభించే ఆహార పదార్థాలతో పౌష్టికాహార వంటకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు సరైన ప్రత్యేక పౌష్టికాహారం అందించాలని సూచించారు. నిర్ణీత సమయంలో గర్భిణీలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంతకు ముందు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, లబ్ధిదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్వైజర్ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.,

## సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఆజాద్ అధికార్ సేన పార్టీ జిల్లా ఇంచార్జ్ ప్రేమ్ దయాళ్**

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 11 (మహా):** సింగరేణి ప్రధాన ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సిఎంఒ) గా పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆజాద్ అధికార్ సేన పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ బోడికల ప్రేమ్ దయాళ్. ఇందులో భాగంగా పలు అంశాలపై ప్రస్తావించగా సానుకూలంగా స్పందించిన సిఎంఒ అమలు దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెడికల్ బోర్డు నిర్వహణ పారదర్శకంగా నిర్వహించి మెడికల్ బోర్డులో కార్మికులకు నష్టం వాటిల్లకుండా న్యాయం చేయాలని అన్నారు. సింగరేణి వ్యాప్తంగా పూర్తి స్థాయిలో వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించి సిబ్బందికి పని భారం తగ్గించాలని, మెరుగైన వైద్యానికి అనుగుణంగా అవసరమైన వైద్య పరికరాలను కొనుగోలు చేయాలని చెప్పారు. మందుల కొరత లేకుండా పూర్తి స్థాయిలో అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి స్థాయిలో ఉచిత వైద్యం అందించాలని కోరారు. మూతపడిన ఆక్సిజన్ ప్లాంట్ ను ప్రారంభించాలని, చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యంతో పాటు పౌష్టికాహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.